తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం-25-జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 237 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# ధరణి అక్రమాలన్నీ త్వరలో బయటపెడతాం

**సిద్దిపేట, సిరిసిల్లలో ఫోరెన్సిక్ ఆడిట్‌తో అక్రమాల గుర్తింపు**

**త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్**
**ధరణి లోసుగుల వల్లే రిజిస్ట్రేషన్ అవకతవకలు**
**మంత్రి పొంగులేటి సంచలన ప్రకటన**

హైదరాబాద్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు): ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని జరిగిన అక్రమాలన్నింటినీ త్వరలోనే ప్రజల ముందు ఉంచుతామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌లోని లోసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను కాజేసిన వారిని, రిజిస్ట్రేషన్ చలానా సొమ్మును దారి మళ్లించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు.

మిగతా 2లో

## సింగరేణి సైట్ విజిట్ నిబంధన

# కొత్తది కాదు


- 2018 నుంచే అమల్లో ఉన్న విధానంపై ఆధారాలతో వివరణ
- దేశవ్యాప్తంగా అనేక సంస్థల్లో ఇదే విధానం అమల్లో ఉందని

**భట్టి విక్రమార్క స్పష్టం**




హైదరాబాద్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు): సింగరేణి కాలరీస్ కంపెనీలో అమలవుతున్న సైట్ విజిట్ నిబంధనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఈ నిబంధన సింగరేణిలో మాత్రమే ఉందన్నది, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా ప్రవేశపెట్టిందన్నది పూర్తిగా అవాస్తవమని ఆయన తేల్చి చెప్పారు. సింగరేణిలో సైట్ విజిట్ విధానం 2018 నుంచే అమల్లో ఉందని భట్టి విక్రమార్క వెల్లడించారు. కోల్ ఇండియా అనుబంధ సంస్థ సీఎంపీడీఐఎల్ సూచించిన టెండర్ నిబంధనల మేరకు అప్పటి నుంచే ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన ఆధారాలను కూడా తన వద్ద ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.
ఇదే తరహా సైట్ విజిట్ నిబంధనలు దేశవ్యాప్తంగా అనేక ప్రముఖ సంస్థల్లో ఎన్నేళ్లుగా అమల్లో ఉన్నాయని భట్టి వివరించారు. ఎన్ఎండీసీ, ఐఐటీలు, ఐఐఎంలు, డిఫెన్స్, ఫైనాన్స్ విభాగాలు, గుజరాత్ ప్రభుత్వ రంగ సంస్థలు సహా పలు కేంద్ర,

మిగతా 2లో



## డిజిటల్ అరెస్ట్ అంటూ మోసం

- సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడపై తెలంగాణ పోలీసుల హెచ్చరిక
- భయపెట్టే కాల్స్, వీడియో కాల్స్‌తో వల
- అప్రమత్తంగా ఉండాలని సూచన

హైదరాబాద్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు): డిజిటల్ అరెస్ట్ అంటూ ప్రజలను భయపెట్టి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లపై తెలంగాణ పోలీసులు తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఫోన్ కాల్స్ లేదా వీడియో కాల్స్ ద్వారా తాము పోలీస్, సీబీఐ, ఇతర దర్యాప్తు సంస్థల అధికారులమని చెప్పకుంటూ, “మీరు డిజిటల్ అరెస్ట్‌లో ఉన్నారు” అంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు తెలిపారు.

7లో

# టీ-హబ్ స్టార్టప్‌లకే అంకితం

- అద్దె కార్యాలయాల తరలింపుపై సీఎం స్పష్టత
- ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్‌కు భంగం కలగనివ్వొద్దు



హైదరాబాద్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు): టీహబ్‌ను పూర్తిగా స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను టీహబ్‌కు మార్చుతున్నట్లు వస్తున్న వార్తలపై సీఎం వెంటనే స్పందించారు.
అమెరికా పర్యటనలో ఉన్న సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు

మిగతా 2లో

## సిట్ విచారణపై కేసీఆర్‌తో కేటీఆర్–హరీశ్ రావు భేటీ

- సిట్ విచారణ వివరాలు కేసీఆర్‌కు నివేదన
- ఫోన్ ట్యాపింగ్ కేసులో న్యాయ పోరాటానికి సిద్ధమనే సంకేతం
- విచారణ పేరుతో ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తోందన్న కేసీఆర్ అభిప్రాయం



హైదరాబాద్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు): ఫోన్ ట్యాపింగ్ కేసులో ‘సిట్’ విచారణకు హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు శనివారం పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌తో భేటీ అయ్యారు.

మిగతా 2లో



## ‘అరైవ్ అలైవ్’ రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం

- జలవిహార్‌లో ఘనంగా నిర్వహణ
- 300 బైక్ ర్యాలీతో బలమైన సందేశం

హైదరాబాద్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు): రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో ‘అరైవ్ అలైవ్ – రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం’ను శుక్రవారం జలవిహార్‌లో విజయవంతంగా నిర్వహించారు. ఖైరతాబాద్, సికింద్రాబాద్ ట్రాఫిక్ జోన్ల పరిధిలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేలా సాగింది.

2లో




## బండి సంజయ్, ధర్మపురి అరవింద్‌లకు

# కేటీఆర్ లీగల్ నోటీసులు

- నిరాధార ఆరోపణలపై తీవ్ర చర్యలకు హెచ్చరిక
- ఐదు రోజుల్లో స్పందించకపోతే సివిల్, క్రిమినల్ కేసులు
- రాజకీయ కక్షతో పరువు నష్టం కలిగించారన్న కేటీఆర్

హైదరాబాద్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు): భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు తనపై మరియు తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ లకు విడివిడిగా లీగల్ నోటీసులు పంపించారు. నోటీసు అందిన ఐదు రోజుల్లోగా స్పందించని పక్షంలో సివిల్, క్రిమినల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.
తన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా ఈ ఇద్దరు నేతలు వ్యాఖ్యలు చేశారని కేటీఆర్ తీవ్రంగా పరిగణించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి సాక్ష్యాలు లేకుండా ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు

మిగతా 2లో

# సి-295తో భారత రక్షణ రంగంలో కొత్త యుగం

- కొనుగోలుదారుని నుంచి భాగస్వామిగా భారత్
- వడోదరాలో తయారీతో వ్యూహాత్మక మార్పు

వడోదరా, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు): భారత రక్షణ రంగంలో చారిత్రక మలుపుగా నిలిచే పరిణామం చోటుచేసుకోనుంది. ‘మేడ్ ఇన్ ఇండియా’లో తొలి సైనిక రవాణా విమానంగా సి 295 2026 సెప్టెంబర్ నాటికి గుజరాత్‌లోని వడోదరా నుంచి రోల్‌అవుట్ కానుంది. ఇది కేవలం ఒక విమానం తయారీ కాదు.. భారత్‌ను రక్షణ కొనుగోలుదారుని స్థాయి నుంచి గ్లోబల్ డిఫెన్స్ భాగస్వామిగా మార్చే వ్యూహాత్మక అడుగు.
దశాబ్దాలుగా సైనిక రవాణా విమానాల విషయంలో దిగుమతులపై ఆధారపడిన భారత్, తొలిసారి దేశీయంగా భారీ స్థాయిలో తయారీకి శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు టెక్నాలజీ బదిలీ లేకుండా, పూర్తిస్థాయి తయారీ జరగని పరిస్థితి నుంచి భారత్ బయటపడుతోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా గ్లోబల్ ఏరోస్పేస్ ఎకోసిస్టమ్‌లో భారత్ శాశ్వతంగా స్థానం సంపాదిస్తోంది.

మిగతా 7లో





## కళ్యాణోత్సవంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ

- అందోల్‌లో భూనీళా సమేత గోదా రంగనాథ స్వామి ఉత్సవం
- భక్తులతో కలిసి దర్శనం, ప్రత్యేక పూజలు
- ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా వేడుకలు

అందోల్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అందోల్‌లోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం భూనీళా సమేత శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి.
సామాన్య భక్తులతో కలిసి మంత్రి కళ్యాణోత్సవాన్ని తిలకించారు.

2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## బండి సంజయ్, ధర్మపురి అరవింద్‌లకు
# కేటీఆర్ లీగల్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)



విరుద్ధమని పేర్కొంటూ, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు పంపిన నోటీసులో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఆయన చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ న్యాయవాదులు ప్రస్తావించారు. కేటీఆర్ కుటుంబం ఫోన్ ట్యాపింగ్ ద్వారా వేల కోట్ల రూపాయలు సంపాదించిందని, సెలబ్రిటీల ఫోన్లు ట్యాప్ చేశారంటూ జనవరి 23న ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ అంశంపై సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం కేసు నడుస్తున్నప్పటికీ, మళ్లీ అదే తరహా ఆరోపణలు చేయడం దురుద్దేశ పూర్వకమని నోటీసులో పేర్కొన్నారు.

అదేవిధంగా ఎంపీ ధర్మపురి అరవింద్‌కు పంపిన నోటీసులో ఆయన చేసిన వ్యక్తిగత దూషణలను తీవ్రంగా తప్పుబట్టారు. డ్రగ్స్ సేవించడం, సరఫరా చేయడం వంటి ఆరోపణలు అక్షేపణీయమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ఐటీ రంగ విస్తరణలో కీలక పాత్ర పోషించిన మాజీ మంత్రి అయిన కేటీఆర్‌పై ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని న్యాయవాదులు స్పష్టం చేశారు. ఈ ఇద్దరు ఎంపీలు తమ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని, ఎలాంటి షరతులు లేకుండా కేటీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసుల్లో డిమాండ్ చేశారు. ఐదు రోజుల్లోగా స్పందించని పక్షంలో న్యాయపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తూ, రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిత్వ హననానికి పాల్పడితే చట్టపరమైన మూల్యం తప్పదని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సింగరేణి సైట్ విజిట్ నిబంధన కొత్తది కాదు

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఈ విధానం సాధారణ ప్రక్రియగా కొనసాగుతోందని తెలిపారు. సత్యాన్ని దాచిపెట్టి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించిన భట్టి విక్రమార్క, వాస్తవాలను పరిశీలించకుండా తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఆధారాలతోనే తాను ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నానని, నిజాలను ప్రజల ముందు ఉంచడమే తమ బాధ్యతని ఆయన స్పష్టం చేశారు.



# డిజిటల్ అరెస్ట్ అంటూ మోసం

- సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడపై తెలంగాణ పోలీసుల హెచ్చరిక
- భయపెట్టే కాల్స్, వీడియో కాల్స్‌తో వల
- అప్రమత్తంగా ఉండాలని సూచన

**హైదరాబాద్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** డిజిటల్ అరెస్ట్ అంటూ ప్రజలను భయపెట్టి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లపై తెలంగాణ పోలీసులు తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఫోన్ కాల్స్ లేదా వీడియో కాల్స్ ద్వారా తాము పోలీస్, సీబీఐ, ఇతర దర్యాప్తు సంస్థల అధికారులమని చెప్పుకుంటూ, "మీరు డిజిటల్ అరెస్ట్‌లో ఉన్నారు" అంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు తెలిపారు.



ఈ తరహా మోసాల్లో బాధితులను ఒంటరిగా ఉంచి, కుటుంబ సభ్యులు లేదా స్నేహితులతో మాట్లాడనీయకుండా చేయడం ప్రధాన ఎత్తుగడగా పోలీసులు పేర్కొన్నారు. భయంతో వెంటనే డబ్బులు పంపాలని ఒత్తిడి చేయడం, వ్యక్తిగత వివరాలు రాబట్టడం జరుగుతోందని తెలిపారు.

తెలంగాణ పోలీసులు స్పష్టం చేసినట్లు, డిజిటల్ అరెస్ట్ అనే విధానం చట్టంలో ఎక్కడా లేదని, పోలీసులు లేదా దర్యాప్తు సంస్థలు ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరని వెల్లడించారు. ఈ తరహా కాల్స్ పూర్తిగా మోసమేనని చెప్పారు.

ఇలాంటి కాల్స్ వస్తే వెంటనే కట్ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు పంపకూడదని, వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదని సూచించారు. సైబర్ మోసాలపై ఫిర్యాదు చేయాలనుకునే వారు 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా సైబర్ నేరాల పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలంగాణ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే ఈ తరహా సైబర్ నేరాలను అడ్డుకోవచ్చని, అవగాహనతోనే భద్రత సాధ్యమని తెలంగాణ పోలీసులు పేర్కొన్నారు.

# ధరణి అక్రమాలన్నీ త్వరలో బయటపెడతాం

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను కుట్రపూరితంగా ప్రవేశపెట్టడం వల్లే అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని మంత్రి విమర్శించారు. దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ ద్వారా పైలట్ ప్రాజెక్ట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించామని తెలిపారు. ఈ ఆడిట్‌లో అనేక అవినీతి వ్యవహారాలు జరిగినట్లు ప్రాథమిక నివేదికలో స్పష్టమైందని చెప్పారు. ఈ నివేదిక ఆధారంగా మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ చేపడతామని ప్రకటించారు.

ఈరోజు డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ధరణి పోర్టల్ అక్రమాలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. విచారణలో ఎదురైన అంశాలు, ఎవరి పాత్ర ఎంత, తెర వెనుక ఎవరైనా ఉన్నారా, రెవెన్యూ అధికారుల పాత్ర ఉందా వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక నివేదికను పరిశీలించిన అనంతరం మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదిక సమర్పించాలని కమిటీకి సూచించారు. ధరణి పోర్టల్ ప్రారంభమైన తర్వాత మొత్తం 52 లక్షల లావాదేవీల్లో 35 లక్షల లావాదేవీలను పరిశీలించగా, ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు గుర్తించినట్లు తెలిపారు. విచారణ అనంతరం 1,109 డాక్యుమెంట్లకు సంబంధించిన సుమారు నాలుగు కోట్ల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని కమిటీ సభ్యులు వెల్లడించినట్లు చెప్పారు. ఇప్పటివరకు తొమ్మిది జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు మంత్రి వివరించారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉండగా, ప్రతిపక్ష నేతలు ఎవరో వెయ్యి కోట్లు, మరెవరో పది వేల కోట్ల అవినీతి అంటూ ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారని పొంగులేటి తీవ్రంగా విమర్శించారు. ఇదిలా ఉండగా, జనవరి 25న ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణ పొందిన మరో రెండు వేల మంది సర్వేయర్లకు లైసెన్సులు అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో నాలుగు వేల మందికి లైసెన్సులు జారీ చేసినట్లు పేర్కొంటూ, ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో రాష్ట్రంలోని నక్షా లేని 373 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# సిట్ విచారణపై కేసీఆర్‌తో కేటీఆర్–హరీశ్ రావు భేటీ

(మొదటి పేజీ తరువాయి)



ఎర్రవల్లి నివాసంలో శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ భేటీలో 'సిట్'విచారణ తీరుతెన్నులను ఇద్దరు నేతలు పార్టీ అధినేత కేసీఆర్‌కు వివరించారు. పార్టీ ముఖ్య నేతల పర్యటనలు, మంత్రులుగా తీసుకున్న నిర్ణయాలు, పలువురు వ్యక్తుల పేర్లను ప్రస్తావిస్తూ వారితో సంబంధాలు, పరిచయాల గురించి పోలీసులు తమను ప్రశ్నించారని వివరించారు. పార్టీకి ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో విరాళాలు ఇచ్చిన సంస్థల వివరాలపై ఆరా తీసినట్లుగా కేసీఆర్‌కు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విచారణతో సంబంధం లేని అంశాలను సిట్ అధికారులు అడిగిన వైనాన్ని కూడా కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్తులోనూ ఇదే తరహాలోనే సంబంధం లేని విషయాల్లో విచారణల పేరిట ప్రభుత్వం హడావుడి చేసి గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేస్తుందనే అభిప్రాయాన్ని కేసీఆర్ వ్యక్తం చేసినట్లు తెలిసింది. సిట్ విచారణకు సహకరిస్తూనే పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే న్యాయ పోరాటం కూడా చేయాలనే అభిప్రాయం ఈ భేటీలో వ్యక్తమైంది.

**మున్సిపల్ ఎన్నికలపై కేసీఆర్ సూచనలు**

మున్సిపల్ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఉమ్మడి జిల్లాల వారీగా కీలక నేతలతో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంతో పాటు రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక, ప్రచార పర్వం, అవసరమైన చోట ఇతర పార్టీల నుంచి చేరికలు వంటి అంశాలపై ఇద్దరు నేతలు దిశా నిర్దేశం చేశారు. ఇదిలా ఉంటే పార్టీ పరంగా మున్సిపల్ ఎన్నికలను పర్యవేక్షించేందుకు జిల్లాలు, మున్సిపాలిటీల వారీగా ఇన్‌చార్జిలను నియమించాలని కేసీఆర్ ఆదేశించారు.

పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలకు మున్సిపాలిటీల వారీగా పర్యవేక్షక బాధ్యతలు అప్పగించనున్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కూడా ఇన్‌చార్జిలు పర్యవేక్షించడంతో పాటు నాయకులు, కేడర్ నడుమ క్షేత్ర స్థాయిల్లో సమన్వయం కోసం పనిచేస్తారు. మున్సిపల్ ఎన్నికలపై కేసీఆర్ ఆదేశాల మేరకు ఎర్రవల్లిలో భేటీ అనంతరం శనివారం రాత్రి హైదరాబాద్‌లో కేటీఆర్, హరీశ్‌రావు కొందరు పార్టీ ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. మున్సిపాలిటీల వారీగా నియమించాల్సిన ఇన్‌చార్జిల జాబితాపై కసరత్తు పూర్తి చేశారు. భేటీ అనంతరం ఈ జాబితాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విడుదల చేశారు.

# టీ–హబ్ స్టార్టప్‌లకే అంకితం

(మొదటి పేజీ తరువాయి)

మార్చాలని స్పష్టంగా సూచించారు. స్టార్టప్‌లకు ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్ క్యాటలిస్ట్‌గా ఏర్పాటు చేసిన టీహబ్లో ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఉండకూడదని సీఎం తేల్చి చెప్పారు. టీహబ్ ప్రత్యేకత, లక్ష్యం దెబ్బతినేలా ఎలాంటి మార్పులు చేయరాదని, అలాంటి ఆలోచనలు ఉంటే వెంటనే విరమించుకోవాలని ఆదేశించారు.

ప్రపంచ స్థాయిలో స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయాలన్న ప్రభుత్వ దృష్టికోణానికి టీహబ్ కీలకమని సీఎం పేర్కొన్నారు. స్టార్టప్‌ల వృద్ధి, ఆవిష్కరణలకు అనుకూల వాతావరణం కొనసాగించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.




# 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం

- జలవిహార్‌లో ఘనంగా నిర్వహణ
- 300 బైక్ ర్యాలీతో బలమైన సందేశం

**హైదరాబాద్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్ - రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం'ను శుక్రవారం జలవిహార్‌లో విజయవంతంగా నిర్వహించారు. ఖైరతాబాద్, సికింద్రాబాద్ ట్రాఫిక్ జోన్ల పరిధిలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేలా సాగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ ట్రాఫిక్ సంయుక్త పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్ హాజరయ్యారు. ప్రత్యేక అతిథిగా సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ పాల్గొని రోడ్డు భద్రత ప్రాముఖ్యతపై సందేశం ఇచ్చారు. అలాగే ట్రాఫిక్ డీసీపీ-1 అవినాష్ కుమార్‌తో పాటు సీనియర్ ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో భాగంగా సుమారు 300 మంది బైక్ రైడర్లతో భారీ బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ ద్వారా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, బాధ్యతాయుతంగా వాహనాలు నడపడం ఎంత ముఖ్యమో ప్రజలకు చాటిచెప్పారు. రోడ్డు వినియోగదారుల భద్రతపై బలమైన సందేశం వెళ్లేలా కార్యక్రమం సాగింది.

రోడ్డు ప్రమాదాలు కేవలం గణాంకాలు మాత్రమే కాకుండా అనేక కుటుంబాల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, సురక్షితంగా ప్రయాణించి 'అరైవ్ అలైవ్' లక్ష్యాన్ని సాధించాలంటూ పాల్గొన్నవారు ప్రతిజ్ఞ చేశారు.



# కళ్యాణోత్సవంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ

**అందోల్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అందోల్‌లోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం భూనీళా సమేత శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి.

సామాన్య భక్తులతో కలిసి మంత్రి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. ఆలయ ప్రాంగణం అంతటా భక్తుల సందడి, వేద మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ వేడుకలు స్థానికులకు విశేష ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించాయి. అనంతరం మంత్రి శ్రీ రంగనాథ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యం, సుఖసంతోషాలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణోత్సవాన్ని విజయవంతం చేశారు.

# మహిళ ఇద్దరు పిల్లలతో అదృశ్యం

**సత్తుపల్లి, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** చెరుకు లక్ష్మి పార్వతి (31) తన ఇద్దరు పిల్లలతో కలిసి శనివారం మధ్యాహ్నం నుంచి అదృశ్యమైన ఘటన కలకలం రేపుతోంది.

వివరాల్లోకి వెళితే... శనివారం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయలుదేరిన లక్ష్మి పార్వతి తన ఇద్దరు పిల్లలతో కలిసి తిరిగి ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఈ విషయమై ఆమె తండ్రి సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఈ ఘటనపై సత్తుపల్లి ఇన్‌స్పెక్టర్ టి. శ్రీహరి ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. లక్ష్మి పార్వతి మరియు ఆమె పిల్లల ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

**సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:**

**8712659167 – టి. శ్రీహరి, ఇన్‌స్పెక్టర్.**

**8712551362 – జి. అశోక్ కుమార్, ఎస్ఐ.**

**8712659168 – సత్తుపల్లి పోలీస్ స్టేషన్.**




# మినీ సమ్మక్క సారలమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి





- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పని చేయాలి
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వేలేరు,జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):** సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించి, త్రాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. వేలేరు మండలం పీచర గ్రామంలో జరగనున్న మినీ సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను ఆయన సంబంధిత శాఖల అధికారులు, స్థానిక సర్పంచులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతర స్పెషల్ ఆఫీసర్‌గా ఎంపీడీవో బాధ్యతలు స్వీకరించి జాతర జరిగే నాలుగు రోజులు అందుబాటులో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణను పక్కాగా చేపట్టాలని, చుట్టుపక్కల గ్రామాల నుంచి అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. అలాగే నీటి సరఫరా, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, జాతర ప్రాంతంలో అవసరమైన లైటింగ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేస్తానని తెలిపారు. జాతర సందర్భంగా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశిస్తూ, అధికారులు, జాతర కమిటీ, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మినీ సమ్మక్క సారలమ్మ జాతరను విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, జాతర కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, సర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభను విజయవంతం చేసిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు






**వరంగల్,జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** గిరిజన ఐక్యతకు ప్రతీకగా, సంఘ గౌరవానికి మరో మైలురాయిగా హనుమకొండలో గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం కంపెనీ కార్యవర్గ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా, విజయవంతంగా నిర్వహించబడిన సందర్భంగా సంఘ నాయకులు, సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి అభూతపూర్వమైన స్పందన లభించడంతో పాటు, అధిక సంఖ్యలో హాజరైన గిరిజన జాతి సోదర-సోదరీమణులు సభ విజయానికి ప్రధాన బలంగా నిలిచారని సంఘ నాయకులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి హాజరు సంఘానికి అపారమైన ధైర్యాన్ని ఇచ్చిందని, సభ్యుల సహకారం, ఐక్యత సంఘ ప్రయాణానికి మార్గదర్శకంగా మారిందని తెలిపారు.

అలాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అహర్నిశలు అంకితభావంతో పనిచేసిన హనుమకొండ సర్కిల్ బాడీ, వరంగల్ సర్కిల్ బాడీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశపు హాల్ అలంకరణ, భోజన ఏర్పాట్లతో పాటు సమన్వయంతో పనిచేసి సంఘ ప్రతిష్ఠను మరింత పెంచడంలో వారు కీలక పాత్ర పోషించారని అన్నారు.

ఈ సందర్భంగా వాలు నాయక్, హర్జీ నాయక్, శ్రీరామ్ నాయక్ లు మాట్లాడుతూ, ఈ ఆత్మీయత, సంఘబలం ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తులోనూ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి అందరూ కలసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# తోకల హృతిక్ రెడ్డి పార్థివదేహానికి నివాళులు అర్పించిన నాయకులు





**చిల్పూర్,జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):** చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన బిజెపి జనగామ జిల్లా అధికార ప్రతినిధి తోకల సంపత్ రెడ్డి కుమారుడు తోకల హృతిక్ రెడ్డి గత నెల 30న జర్మనీలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. హృతిక్ రెడ్డి మృతదేహం ఈ రోజు ఉదయం స్వగ్రామానికి చేరుకోగా, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. హన్మకొండ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారామ్ నాయక్, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బిజెపి మాజీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంతిమయాత్రలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, బిజెపి జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలోని అంజిరెడ్డి, చిల్పూర్ మండల పార్టీ అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్, స్టేషన్ ఘనపూర్ మండల పార్టీ అధ్యక్షుడు సట్ల వెంకటరమణ గౌడ్, జఫర్గడ్ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నగేష్ గౌడ్, ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు గుగ్గులోత్ మధు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ తౌటిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డిని కలిసిన వెల్టూర్ సర్పంచ్ అశోక్



**పెద్దమందడి,జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ సర్పంచ్ అశోక్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పెద్దమందడి ఎస్ఐ జలంధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామంలోని శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖతో పూర్తి సహకారం అందిస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా, వెల్టూర్ గ్రామంలో రెండు మూడు రోజుల్లో నూతనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ అశోక్ ఈ సందర్భంగా తెలిపారు. గ్రామంలోని ముఖ్య కూడళ్లతో పాటు అవసరమైన ప్రాంతాల్లో ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దీని ద్వారా నేరాల నివారణతో పాటు ప్రజల భద్రత మరింత మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పోలీస్-గ్రామ పాలన మధ్య సమన్వయంతో పనిచేస్తేనే గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పవచ్చని సర్పంచ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ జలంధర్ రెడ్డి మాట్లాడుతూ..గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శాంతిభద్రతలకు ఎంతో ఉపయోగపడుతుందని, ప్రజల సహకారంతో మండల పరిధిలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేస్తామని తెలిపారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, మాజీ ఉపసర్పంచ్ నాగమణి నరేష్, వార్డు సభ్యులు జోగు వెంకటేష్, పట్నం సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

# కీసరలో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం




**కీసర, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని విజ్ఞాన్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం కీసరలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. బాలికల హక్కులు, విద్య, భద్రతపై సమాజంలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా కీసర ప్రధాన చౌరస్తా నుంచి కీసర పోలీస్ స్టేషన్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు 'బేటీ బచావో - బేటీ పడావో', 'బాలికల చదువే భవిష్యత్తుకు బాట' వంటి నినాదాలు చేస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. ర్యాలీ మార్గమంతా బాలికల ప్రాముఖ్యతపై సందేశాలు వినిపించడంతో స్థానికులు అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కీసర సీఐ ఆంజనేయులు, ఎస్సై లక్ష్మణ్ మాట్లాడుతూ, బాలికలకు విద్య, భద్రత, సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజం సుస్థిరంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. బాలికలపై జరుగుతున్న వివక్షను నిర్మూలించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. మహిళలు, బాలికలు చట్టాలను తెలుసుకొని ధైర్యంగా ముందుకు రావాలని సూచించారు.

విజ్ఞాన్ కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ, బాలికల చదువుకు తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, చదువు ద్వారానే బాలికలు స్వతంత్రంగా ఎదుగుతారని అన్నారు. బాలికల సాధికారతే దేశ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ బాలికల దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

# "తెలంగాణ ముచ్చట్లు"దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్ బి.ఎం. సంతోష్ కుమార్



**జోగులాంబ గద్వాల్, జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముచ్చట్లు దినపత్రికకు సంబంధించిన క్యాలెండర్ ను జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్‌కుమార్ శనివారం ఆవిష్కరించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.....ప్రజలకు నిష్పక్షపాతమైన, విశ్వసనీయమైన సమాచారాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ పత్రిక ప్రజాస్వామ్యానికి బలంగా నిలుస్తుందని అన్నారు.

ప్రాంతీయ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా ప్రయోజన అంశాలను బాధ్యతాయుతంగా ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో మీడియాకు కీలక పాత్ర ఉందని పేర్కొన్నారు. సమాజానికి మేలు చేసే వార్తలను ప్రచురిస్తూ పత్రిక తనదైన గుర్తింపును సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా తెలంగాణ ముచ్చట్లు పత్రిక యాజమాన్యానికి,రిపోర్టర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక రిపోర్టర్ తెలుగు మధు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ వేగవంతంగా పరిష్కారాలు అమలు చేయాలి



- నెమలి అనిల్ కుమార్

**మల్లాపూర్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకొని వేగవంతంగా పరిష్కారాలు అమలు చేయాలని నెమలి అనిల్ కుమార్ అధికారులను కోరారు. మల్లాపూర్ వార్డు కార్యాలయంలో నాచారం సర్కిల్ నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈఈ రమేష్, డిప్యూటీ ఇంజనీర్ డీఈ మహేశ్వరిని ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా మల్లాపూర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, అలాగే నూతన డివిజన్‌కు సంబంధించిన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. డివిజన్ పరిధిలోని మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు వేగంగా, సమయపాలనతో పూర్తిచేయాల్సిన అవసరాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మల్లాపూర్ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరిన నెమలి అనిల్ కుమార్, ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించిన అధికారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో సీనియర్ నాయకులు దంతూరి రాజు గౌడ్, బాల్‌రాజ్ గౌడ్, కోయలకొండ రాజేష్, కప్పర సాయి, దాసరి సాయి తదితరులు, కాప్రా డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# భారతరత్న కర్పూరి ఠాకూర్ నాయి సేవలు చిరస్మరణీయం





- నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక నగర అధ్యక్షులు యలమందల జగదీష్
- ఖమ్మంలో ఘనంగా బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ నాయి 102వ జయంతి ఉత్సవాలు

**ఖమ్మం బ్యూరో, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** నాయి బ్రాహ్మణ సమాజ ముద్దుబిడ్డ, భారతరత్న అవార్డు గ్రహీత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ నాయి గారి సేవలు చిరస్మరణీయమైనవని నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ కొనియాడారు. ఖమ్మం నగర నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న అవార్డు గ్రహీత కర్పూరి ఠాకూర్ నాయి 102వ జయంతి ఉత్సవాలు శనివారం ఖమ్మం నగరంలోని నాయి బ్రాహ్మణ కమిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర అధ్యక్షులు యలమందల జగదీష్ పాల్గొని కర్పూరి ఠాకూర్ నాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కర్పూరి ఠాకూర్ తన రాజకీయ జీవితాన్ని పూర్తిగా సామాజిక న్యాయం, సమానత్వం కోసం అంకితం చేశారని తెలిపారు. బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాలు, సామాజిక గౌరవం కల్పించేందుకు ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పేదల పాలిట నిజమైన ప్రజానాయకుడిగా కర్పూరి ఠాకూర్ నిలిచారని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని నాయి బ్రాహ్మణ సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేసి, సమాజ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ గౌరవ సలహాదారులు దోమకొండ నాగేశ్వరావు, వర్కింగ్ ప్రెసిడెంట్లు తుపాకుల కృష్ణ, శ్రీపతి రామనాథం, ప్రచార కార్యదర్శి ఇల్లందుల కనకయ్య, స్టీరింగ్ కమిటీ సభ్యుడు గరిడేపల్లి నవీన్, ఈసీ మెంబర్ మాదారపు బిక్షంతో పాటు కమిటీ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం చివర్లో కర్పూరి ఠాకూర్ నాయి ఆశయాలను కొనసాగిస్తూ, సమాజ సేవలో ముందుండాలని ప్రతిజ్ఞ చేశారు. జై నాయి - జై జై నాయి. నాయి బ్రాహ్మణ ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాలతో కార్యక్రమం ఉత్సాహంగా ముగిసింది.

# సత్తుపల్లి డిపోలో ఘనంగా డ్రైవర్స్ డే వేడుకలు





**సత్తుపల్లి, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** డ్రైవర్స్ డే సందర్భంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఏకాగ్రతతో వాహనం నడిపితే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకూడదని, మద్యం సేవించి వాహనం నడపడం నేరమని డ్రైవర్లకు స్పష్టం చేశారు. ఉదయం 5 గంటల నుంచే సత్తుపల్లి డిపోలో ప్రతి డ్రైవర్‌కు గులాబీ పూలు అందజేసి డ్రైవర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ సంస్థ ఆదాయం పెంపునకు కృషి చేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి. ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్. సాహితి సహా ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# హోమీ జే. బాబా 60వ వర్ధంతి వేడుకలు





**ఏ ఎస్ రావు నగర్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం -స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ అణు శాస్త్రవేత్త, పద్మ విభూషణ్ డాక్టర్ హోమీ జే. బాబా 60వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఏఎస్ రావు నగర్ కాలనీలోని హోమీ జే. బాబా ఫంక్షన్ హాల్‌లో ఉన్న హోమీ జే. బాబా విగ్రహం వద్ద ఈ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరి రావు అధ్యక్షత వహించారు. ముందుగా ఎన్ఎఫ్‌సీ రిటైర్డ్ సీనియర్ నాయకులు ఉదయ భాస్కర్ హోమీ జే. బాబా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త, సీనియర్ సైంటిస్టు కర్రె మల్లేశం మాట్లాడుతూ, హోమీ జే. బాబా 1909 అక్టోబర్‌లో బొంబాయిలో పార్సీ కుటుంబంలో జన్మించారని తెలిపారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రంలో విద్యాభ్యాసం పూర్తి చేసిన అనంతరం భారతదేశానికి తిరిగివచ్చి అణు రంగ అభివృద్ధికి అపూర్వ సేవలు అందించారని అన్నారు. అణు శక్తిని శాంతి ప్రయోజనాల కోసం వినియోగించాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి వల్ల భారతదేశం అణు రంగంలో స్వావలంబన సాధించిందని పేర్కొన్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టిఐఎఫ్ఆర్) స్థాపనతో పాటు, నేటి బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ ఆయన పేరుతో కొనసాగుతుండటం ఆయన సేవలకు నిదర్శనమని తెలిపారు. డాక్టర్ ఏఎస్ రావు, విక్రమ్ సారాభాయ్ వంటి ప్రముఖ శాస్త్రవేత్తలు ఆయన మార్గదర్శకత్వంలో ఎదిగారని అన్నారు. ఎన్ఎఫ్‌సీ, ఈసీఐఎల్ వంటి సంస్థల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ, దేశాభివృద్ధిలోనూ ఆయన పాత్ర కీలకమని చెప్పారు. విద్యార్థులు హోమీ జే. బాబా జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఎన్ఎఫ్‌సీ సీనియర్ నాయకులు పి. మల్లేశం, ఉదయ భాస్కర్, సిహెచ్. ప్రభాకర్, ఈసీఐఎల్ సీనియర్ నాయకులు జి. శివరామకృష్ణ తదితరులు మాట్లాడుతూ, హోమీ జే. బాబా కృషి ఫలితంగా భారతదేశం ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిందని అన్నారు. అనంతరం విద్యార్థులు, సభ్యులు హోమీ జే. బాబా విగ్రహానికి పూలు వేసి నివాళులర్పించారు. స్ఫూర్తి గ్రూప్ నాయకులు బాలు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఉదయ భాస్కర్, ఈ. మల్లేష్, కే. మల్లేష్, శివరామకృష్ణ, ఎం. భాస్కర్ రావు, ప్రభాకర్, బాలు, సదాశివా హై స్కూల్ డాక్టర్ ఏఎస్ రావు నగర్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ట్రాన్స్ఫార్మర్ పరిసర ప్రాంతాలను శుభ్రపరచిన విద్యుత్ శాఖ సిబ్బంది



**కాజీపేట్ జనవరి 24 తెలంగాణ ముచ్చట్లు :** కాజీపేట చౌరస్తాలోని ట్రాన్స్ఫార్మర్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం తోపాటు పిచ్చి మొక్కలను శనివారం విద్యుత్ శాఖ సిబ్బంది శుభ్రం చేశారు. ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా ఏఈ చందులాల్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది గత కొద్ది రోజులుగా కాజీపేటలో ని విద్యుత్ వైర్లపై ఉన్న మొక్కల తీగలను ట్రాన్స్ఫార్మర్ ల సమీపంలో ఉన్నపిచ్చి మొక్కలను శుభ్రం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో చందులాల్ తోపాటు ఫోర్ మెన్ మహమ్మద్ అలీ, లైన్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , సుధాకర్ రెడ్డి, లైన్ మెన్ శ్రీనివాస్, రాము, లతోపాటు రాజు, సతీష్, వెంకటేశ్వర్లు, శ్రావణ్ లు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటిని కలిసిన సంఘాల నాయకులు



**హైదరాబాద్,జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):** దావోస్ పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగివచ్చిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిను వివిధ సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దావోస్‌లో తెలంగాణ మోడల్ దేశ సగటును మించిన పనితీరును నమోదు చేయడంపై వారు అభినందనలు వ్యక్తం చేశారు. 2024, 2025 దావోస్ ఎంవోయూల అమలులో తెలంగాణకు 60 శాతం స్ట్రైక్‌రేట్ సాధించగా, దేశ సగటు 35 శాతంగానే ఉండటం గమనార్హమని పేర్కొన్నారు.

‘తెలంగాణ రైజింగ్’ విజన్‌తో భారీ పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోవడం, భారత్ ఫ్యూచర్ సిటీతో పాటు తొలి నెట్‌జీరో స్మార్ట్ సిటీపై గ్లోబల్ స్థాయిలో ఆసక్తి నెలకొనడం రాష్ట్రానికి దిశానిర్దేశకంగా నిలిచిందని అన్నారు. క్యూర్-ప్యూర్-రేర్ వ్యూహంతో 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా రేవంత్ రెడ్డితో కలిసి అమెరికా పర్యటనను విజయవంతంగా పూర్తి చేసి తిరిగివచ్చిన సందర్భంగా మంత్రి పొంగులేటిని అభినందించారు.

ఈ కార్యక్రమంలో మార్వాడి గో బ్యాక్ జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, మోత్కూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ చాగంటి రాములు, ఓయూ జేఏసీ నాయకుడు గాదె వెంకట్, తెలంగాణ దళిత బహుజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, మాదిగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి గుర్రం కోటేష్, ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదుగుల శివ, వడ్డేమాన్ రాజారాం ప్రకాష్, మద్దెల రాజు, పాలడుగు రమేష్, కాంగ్రెస్ నాయకుడు ఓరుగంటి శ్రీకాంత రజక తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లల విద్యను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి...




- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
- మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల గోడ ప్రతులను ఆవిష్కరించిన అదనపు కలెక్టర్

**ఖమ్మం బ్యూరో, జనవరి -24(తెలంగాణ ముచ్చట్లు):** ఆడపిల్లల విద్యను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శనివారం ముస్లిం మైనార్టీ ప్రతినిధులతో కలిసి మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 7 మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు నడుస్తున్నాయని, వీటిలో 6 నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య మైనారిటీలకు అందించడం జరుగుతుందని అన్నారు. ఖమ్మంలోని మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థలలో చదివిన 38 మంది విద్యార్థులకు ఐఐటీ సీట్లు, 39 మంది ఎంబీబీఎస్, 11 మంది సీఏ, 14 మంది లా సెట్ క్రాక్ చేశారని తెలిపారు. మైనారిటీ జీవితాలలో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం మైనారిటీ విద్యా సంస్థలు ఏర్పాటు చేసిందని అన్నారు. మనం బాగుపడాలంటే చదువు చాలా కీలకమని అన్నారు. ఇంజనీరింగ్, మెడిసిన్, ప్రభుత్వ ఉపాధిలో మహిళలు బాగా రాణిస్తున్నారని అన్నారు. ముస్లిం వర్గాలలో బాలికల విద్యను ప్రోత్సహించాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకులాలో సీట్లను పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్, సిఐ రామకృష్ణ, రీజినల్ లెవెల్ కో ఆర్డినేటర్ ఎంజె అరుణకుమారి, ముస్లిం మత పెద్దలు, మస్జిద్ కమిటీ సదర్లు ( ప్రెసిడెంటు / సెక్రటరీ ), మైనారిటీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రాజకీయాలకు పునాది యూత్ కాంగ్రెస్




ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి,జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి పట్టణంలోని ఎంవైఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా యూత్ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకు యూత్ కాంగ్రెస్ పునాది లాంటిదని, యూత్ కాంగ్రెస్ నుంచి ప్రారంభమైన రాజకీయాలు ఎంతో పటిష్టంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని, పార్టీ కోసం రోజుకు కనీసం రెండు గంటలు కేటాయించాలని సూచించారు. సోషల్ మీడియా ప్రచారంలో యూత్ కాంగ్రెస్ ముందుండాలని, భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీ గారిని చేసేంతవరకు నిర్విరామంగా కృషి చేయాలని యువకులకు పిలుపునిచ్చారు. అవినీతిమయమైన బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తోందని, అలాంటి అసత్య ప్రచారాలను యూత్ కాంగ్రెస్ యువకులు ఎప్పటికప్పుడు ఖండిస్తూ సోషల్ మీడియాలో చురుగ్గా ఉండాలని సూచించారు.యువత అనుకుంటే ఏదైనా సాధించగలదని, వనపర్తి జిల్లా పరిధిలోని ప్రతి యూత్ కాంగ్రెస్ కార్యకర్త పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేయాలని తెలిపారు.ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గంలో 40 మందికి పైగా సర్పంచులు యువకులేనని, కాంగ్రెస్ పార్టీ యువతకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో దీనివల్ల స్పష్టమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో నెలకు కనీసం రెండు యూత్ సమావేశాలు నిర్వహించాలని, ప్రత్యక్ష రాజకీయాలపై ఆసక్తి ఉన్న యువకులకు సర్వేల ఆధారంగా అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. గ్రామాల్లో రైతు కూలీలతో మమేకమై అక్కడి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. జిల్లాల పునర్విభజనపై అవగాహన లేని కొందరు బీఆర్ఎస్ నాయకులు జిల్లాల రద్దు అంటూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని, అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్ని భేదాభిప్రాయాలు ఉన్నా అందరూ కలిసి పనిచేసే పార్టీ కాంగ్రెస్ అని, పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విత్ ఐవైసీ యాప్‌ను ఉపయోగించి యూత్ కాంగ్రెస్ చేపట్టే కార్యక్రమాలను నమోదు చేయాలని సూచించారు .ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇంచార్జి సయ్యద్ ఖలీద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీద్, వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, శివాంత్ రెడ్డి, సుకన్య, ఆయా మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సైన్స్‌ను అందిపుచ్చుకుని కొత్త ఆలోచనలకు పదును పెట్టాలి



స్కూల్ ప్రిన్సిపాల్ లవ్లీ బెన్నీ

**వనపర్తి,జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కేంద్రంలోని వల్లబ్ నగర్ గౌతమ్ మోడల్ హైస్కూల్లో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సుమారు 400 మంది విద్యార్థులు హాజరుకాగా, మొత్తం 174 వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ లవ్లీ బెన్నీ మాట్లాడుతూ ..రోజురోజుకు సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు జరుగుతున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులు సైన్స్‌ను అలవర్చుకుని కొత్త ఆలోచనలకు పదును పెట్టాలని సూచించారు. చిన్ననాటి నుంచే ఆలోచనా శక్తిని పెంపొందించుకుంటే సాంకేతిక రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు.సైన్స్ అంటేనే నిజమని, సైన్స్ ద్వారా ప్రపంచంలో ప్రకృతిలో దాగి ఉన్న సత్యాలను తెలుసుకోవచ్చని చెప్పారు.సైన్స్‌ను జీవితంలో భాగంగా చేసుకుంటే భవిష్యత్తులో ముందుకు సాగడం సులభమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బెన్నీ జోసెఫ్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక నమూనాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# నీ ఇంటి స్థలం కోసమే నా పోరాటం..

- టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి
- ఇండ్ల జాగాల ఉద్యమం లో సంఘాలన్నీ కలిసి రావాలి
- గణతంత్ర వేడుక దినోత్సవ సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు



**ఖమ్మం బ్యూరో, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** జర్నలిస్టుల ఇంటి జాగా సాధించే వరకు తమ ఉద్యమం ఆగదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి స్పష్టం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో టిడబ్ల్యూజేఎఫ్ ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ సన్నాహ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, జర్నలిస్టుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమని అన్నారు. అవసరమైతే ఉద్యమాన్ని జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

జర్నలిస్టుల ఇంటి జాగాల విషయంలో గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని ఇకపై సహించేది లేదని ఆయన హెచ్చరించారు. జర్నలిస్టుల కుటుంబాలకు భద్రత, గౌరవం కల్పించే వరకు టిడబ్ల్యూజేఎఫ్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి అదనపు సభ్యుల నియామకం చేపట్టారు.

అనంతరం ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ మాట్లాడుతూ, జనవరి 26 ఉదయం 7:45 గంటలకు ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టీబీజేఏ జిల్లా అధ్యక్షులు వందనపు సామ్రాట్ గుప్తా, వీడియోగ్రాఫర్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్, జిల్లా కోశాధికారి అర్వపల్లి నాగేష్, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి కుంభం రవికుమార్, టీబీజేఏ జిల్లా కోశాధికారి శ్రీధర్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు

# కాకరవాయి క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగింపు

- ఫస్ట్ ప్రైస్ మరిపెడ బంగ్లా. రెండవ విజేతగా కాకరవాయి.



**ఖమ్మం బ్యూరో, జనవరి 24(తెలంగాణ ముచ్చట్లు):** కాకరవాయి గ్రామంలో గ్రామీణ యువతకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా, క్రీడాస్ఫూర్తితో ముగిసింది. వివిధ గ్రామాల నుంచి పాల్గొన్న జట్లు పోటీపడగా, చివరికి మరిపెడ బంగ్లా జట్టు అత్యుత్తమ ప్రదర్శనతో ఫస్ట్ ప్రైస్‌ను కైవసం చేసుకుంది. ఆతిథ్య జట్టుగా బరిలోకి దిగిన కాకరవాయి జట్టు రెండవ స్థానంలో నిలిచి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది.

ఫైనల్ మ్యాచ్ చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగి, ఆటగాళ్ల చురుకుదనం, సమన్వయం, క్రీడాస్ఫూర్తి అందరి ప్రశంసలు పొందాయి. ప్రేక్షకుల చప్పట్ల మధ్య ఆటలు ఉత్కంఠగా కొనసాగాయి.విజేతలుగా నిలిచిన రెండు జట్లకు కాకరవాయి గ్రామ సర్పంచ్ గూడూరు ఉపేందర్, ఉప సర్పంచ్ కొత్తపల్లి వినోద, 2వార్డు సభ్యుడు నల్లగట్టు శ్రీనివాస్,3 వ వార్డ్ సభ్యులు షేక్ యాకుబ్ పాషా ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గూడూరు ఉపేందర్ మాట్లాడుతూ.. క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు స్నేహభావం, క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందిస్తాయి. యువతను చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచేందుకు క్రీడలు అత్యంత అవసరం అని తెలిపారు. గ్రామ స్థాయిలో ఇలాంటి క్రీడా కార్యక్రమాలకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ సహకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఉప సర్పంచ్ కొత్తపల్లి వినోద మాట్లాడుతూ..గ్రామీణ యువత ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా టోర్నమెంట్‌లు వేదికగా మారాలని, భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.అదే విధంగా వార్డు మెంబర్స్ నల్లగట్టు శ్రీనివాస్,షేక్ యాకుబ్ పాషా మాట్లాడుతూ..గ్రామాల్లో క్రీడా వాతావరణం పెరగడం వల్ల యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణతో ఎదుగుతుంది. గ్రామీణ స్థాయిలో ప్రతిభ ఉన్న ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతో ఉపయోగపడతాయి.యువత క్రీడల్లో ముందుకు రావడానికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని తెలిపారు.ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను గ్రామస్తులు అభినందించగా, కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆటగాళ్ల పోరాటంతో, ప్రేక్షకుల ఉత్సాహంతో కాకరవాయి గ్రామం క్రీడోత్సవ వాతావరణాన్ని సంతరించుకుంది.ఇదే సందర్భంలో క్రీడా స్ఫూర్తిని అత్యుత్తమంగా నిలబెట్టినందుకు మంగలి బండ తండ గ్రామ జట్టుకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. క్రీడల్లో గెలుపోటములు సమానమేనని, ఆట తీరుతో పాటు క్రీడాస్ఫూర్తి కూడా ముఖ్యమని అతిథులు అభినందించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మేనేజ్మెంట్ సభ్యులు నల్లగట్టు నవీన్,ఉడుగుల మధు, దోసపాటి ఉపేందర్,నల్లగట్టు వేణు, నల్లగట్టు లింగయ్య, నల్లగట్టు రోహిత్ కుమార్, జిల్లా మనోజ్, ఉడుగుల నరేష్ తదితరులు పాల్గొన్నారు..

# ఆర్టీఐ యాక్టివిటీస్ ఫోరం సహకారంతో మహిళా సంఘంలో మందలలిత చేరిక



**అడ్డాకల్,జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):** ఆర్టీఐ యాక్టివిటీస్ ఫోరం మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు మంగరాయి వెంకటేష్ సహాయంతో బలీదుపల్లి గ్రామానికి చెందిన మందలలితను మహిళా సంఘంలో చేర్చారు. రెండు నెలల క్రితం ఆర్థిక సహాయం కోరుతూ మహబూబ్‌నగర్ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశాల మేరకు మహిళా సంఘంలో చేర్చాలని సూచనలు జారీ అయ్యాయి.ఈ ఆదేశాల ప్రకారం అడ్డాకుల మండల ఏపీఎం మహేష్ సూచనతో శుక్రవారం వీఏఓ శ్రీధర్ బలీదుపల్లి గ్రామంలోని మందలలిత స్వగృహంలో నూతనంగా ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా సంఘాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విలేజ్ బుక్ కీపర్ శ్రీధర్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి మహిళా సంఘాలు ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి మహిళ మహిళా సంఘంలో చేరి పొదుపు అలవాటు చేసుకోవాలని, ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మహిళా సంఘాలను ఏర్పాటు చేసిందని వివరించారు. మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందుతూ కుటుంబ అవసరాలు, పిల్లల చదువుకు ఆర్థికంగా తోడ్పాటు పొందవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా సంఘానికి అధ్యక్షురాలిగా మందలలిత, కార్యదర్శిగా సుజాతను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మహిళా సంఘాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి సాధించి, ఆర్థికంగా బలోపేతం కావాలని పాల్గొన్న వారు ఆకాంక్షించారు.




# బీసీ–ఎస్సీ–ఎస్టీ–మైనారిటీల ఐక్యతతో రాజ్యాధికారం సాధ్యం

- వరంగల్ ఆవిర్భావ సభలో బానోత్ సునీల్ నాయక్ వ్యాఖ్యలు

**వరంగల్,జనవరి 24(తెలంగాణ ముచ్చట్లు):** బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలు అన్నీ ఐక్యంగా ముందుకు సాగితే రాబోయే రోజుల్లో రాజ్యాధికారం సాధించడం సాధ్యమని ఎల్‌హెచ్‌పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ సునీల్ నాయక్ అన్నారు. వరంగల్‌లో నిర్వహించిన బీసీ-ఎస్సీ-ఎస్టీ జేఏసీ ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు.


ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ విశారదన్ నాయకత్వంలో ఏర్పడిన జేఏసీని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేయాలని, ప్రతి జిల్లాలో కమిటీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. సామాజిక న్యాయం లక్ష్యంగా జేఏసీ పనిచేస్తుందని చెప్పారు.

2029లో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో జేఏసీ పోటీ చేయనున్నట్లు, అదే విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పోటీ చేస్తుందని వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ సాధన కోసం ఎల్‌హెచ్‌పీఎస్ నంగరభేరి ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందని బానోత్ సునీల్ నాయక్ స్పష్టం చేశారు.

# అనారోగ్య బాధితుడికి రూ.2.50 లక్షల ఎల్ఓసి అందజేత

- మణిగిల్ల కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి శివ యాదవ్

**వనపర్తి,జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):** ఖిల్లా ఘణపూర్ మండలం సోలిపూర్ గ్రామానికి చెందిన జనగే చంద్రమౌళి (తండ్రి: జె. నరసింహ) అనారోగ్యంతో బాధపడుతుండగా..ఈ విషయం తెలుసుకున్న కంటెస్టెడ్ సర్పంచ్ మణిగిల్ల శివ యాదవ్ వెంటనే స్పందించారు. బాధితుడిని పరామర్శించి, పరిస్థితిని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చంద్రమౌళిని హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి, బుచ్చన్న నాయుడు సహకారంతో రూ.2 లక్షల 50 వేల విలువైన ఎల్ఓసిని బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ ఎల్ఓసి ద్వారా బాధితుడికి అవసరమైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా చంద్రమౌళి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. అనారోగ్య సమయంలో తమను ఆదుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ సహాయానికి చొరవ తీసుకున్న కంటెస్టెడ్ సర్పంచ్ శివ యాదవ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: పొట్లపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఆకారపు సత్యనారాయణ అంతిమయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు





**ఉప్పల్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ కుమార్ తండ్రి సత్యనారాయణ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతిచెందారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఆయన అంతిమయాత్రలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని మృతుడికి ఘన నివాళులు అర్పించారు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి మృతుడి పార్థివ దేహాన్ని సందర్శించి పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ కుటుంబానికి ఆధారస్తంభంగా నిలిచారని, ఆయన మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కఠిన సమయంలో ఆకారపు అరుణ్ కుమార్ కుటుంబానికి పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు.

అలాగే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పూర్ణ యాదవ్, వైస్ చైర్మన్ విఠల్ నాయక్, సీనియర్ యూత్ కాంగ్రెస్ నాయకులు టిల్లు యాదవ్ తదితరులు కూడా అంతిమయాత్రలో పాల్గొని మృతుడికి నివాళులర్పించారు. వారు ఆకారపు అరుణ్ కుమార్, ఆకారపు అనిల్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంతిమయాత్ర సందర్భంగా పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు హాజరై సత్యనారాయణకు కన్నీటి వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులు ఆయన సేవలు, జీవన ప్రయాణాన్ని స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.

# ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి






- **మాల్ సిబ్బంది, యాజమాన్యానికి సీఐ తుమ్మలపల్లి శ్రీహరి సూచన.**

**సత్తుపల్లి, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు ప్రమాదాలను నివారించి, ప్రాణనష్టాన్ని తగ్గించడమే లక్ష్యంగా సత్తుపల్లి పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సత్తుపల్లి పట్టణ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి సత్తుపల్లి పట్టణంలోని జీవి షాపింగ్ మాల్‌లో నిర్వహించారు. మాల్‌లో పనిచేస్తున్న సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. అలాగే మాల్ యాజమాన్యం తమ సిబ్బంది ట్రాఫిక్ నియమాలు పాటించేలా పర్యవేక్షించాలని సూచించారు. ఇదే విధంగా సత్తుపల్లి పట్టణంలోని అన్ని వాణిజ్య, వ్యాపార సంస్థల యాజమాన్యాలు కూడా తమ వద్ద పనిచేసే సిబ్బంది రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని సీఐ కోరారు. కళాశాలలు, పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ కళాశాలలకు హాజరయ్యే విద్యార్థులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలు, ప్రమాద మరణాలు తగ్గించేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# అభివృద్ధిలో పాలేరు నంబర్ వన్..!

- పేదల పాలిట ఆపద్బాంధవుడు మంత్రి పొంగులేటి
- 109 మందికి రూ.38.70 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి



**ఖమ్మం బ్యూరో, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మార్గనిర్దేశంలో పాలేరు నియోజకవర్గం అభివృద్ధిలో రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో దూసుకెళ్తుందని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. శనివారం ఖమ్మం నగరం శ్రీనగర్ కాలనీలోని మంత్రి నివాసంలో తిరుమలాయపాలెం మండలానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మొత్తం 109 మంది బాధితులకు రూ.38.70 లక్షల విలువైన చెక్కులను అందజేస్తూ పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

సాగు, తాగునీటిలో అగ్రగామి.. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి ప్రత్యేక చొరవతో పాలేరు నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించిన ప్రజలు, రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ అదే తీర్పును పునరావృతం చేయాలని కోరారు.

అంకితభావంతో పనిచేయాలి..నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున, స్థానిక సంస్థల్లోనూ కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఉంటే అభివృద్ధి మరింత వేగవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా రంజాన్ మాసం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి...

## అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం బ్యూరో, జనవరి 24(తెలంగాణ ముచ్చట్లు):** ప్రశాంతంగా రంజాన్ మాసం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రంజాన్ మాసం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో, ముస్లిం ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ప్రశాంతంగా జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీలలో సైతం అవసరమైన ఏర్పాట్ల కోసం అధికారులకు సూచనలు జారీ చేశామని అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద ఎక్కడైనా డ్రైయినేజి, అప్రోచ్ రోడ్డు గుంతల మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని అన్నారు. మసీదుల వద్ద హైమాస్ లైట్, వీధి దీపాల పని తీరు పర్యవేక్షించాలని, మసీదుల వద్ద పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. మసీదుల వద్ద వీధి కుక్కల బెడద ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. మసీదు పరిసరాల ప్రాంతాల్లో కుక్కలకు, కోతులకు ఎట్టి పరిస్థితుల్లో ఆహారం పెట్టవద్దని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి మసీదు వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. షాపులు 24 గంటలు నడిపేందుకు గల అవకాశాలను పరిశీలించి పోలీసు శాఖ సూచనలు అందిస్తుందని అన్నారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని, మసీదులకు అవసరమైన మేర త్రాగునీటి సరఫరాను అందిస్తామని అన్నారు. ప్రతి మసీదు దగ్గర పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, ఏదైనా మస్జిద్ దగ్గర త్రాగు నీటి సరఫరా, విద్యుత్ సరఫరా సంబంధించి ఏదైనా పనులు ఉంటే వెంటనే తెలియజేయాలని ముఖ్యంగా ఈద్గాలు, కబ్రస్తాన్‌లలో పిచ్చి మొక్కలు తొలగించాలని పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

గ్రామ పంచాయతీలలో ఉన్న మస్జిద్ జాబితా తయారు చేసి రెగ్యులర్ గా అక్కడ పారిశుధ్య పనులు జరిగేలా పంచాయతీ అధికారి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మస్జిద్ వద్ద నిరంతరం విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పండగ సందర్భంగా షాపింగ్ కోసం మార్కెట్ వద్ద పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన భద్రత ఏర్పాట్లు చేయాలని, ప్రతి మసీదు వద్ద పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మస్జిద్ పరిసరాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అనంతరం ప్రతి మసీదు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ముస్లిం ప్రతినిధులతో అదనపు కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు.

ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, పోలీస్ సిఐ రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు, మస్జిద్ కమిటీ సదర్లు ( ప్రెసిడెంటు / సెక్రటరీ ), మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట రింగ్‌రోడ్డు సెంటర్‌లో వ్యాపారస్తుల ధర్నా



- **తక్షణమే రోడ్డు పూర్తి చేయాలి.**
- **ధూళితో వ్యాపారాలకు తీవ్ర ఇబ్బందులు.**

**అశ్వారావుపేట, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట పట్టణంలోని రింగ్‌రోడ్డు సెంటర్ వద్ద రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని, వాటి వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వ్యాపారస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రింగ్‌రోడ్డు సెంటర్ వద్ద స్థానిక వ్యాపారస్తులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు.

పూర్తికాకుండా వదిలేసిన రోడ్డు పనుల కారణంగా రోజంతా ఎగిసిపడుతున్న ధూళి వల్ల వ్యాపారాలు తీవ్రంగా దెబ్బ తింటున్నాయని వారు వాపోయారు. దుకాణాల్లోకి ధూళి చేరి సరుకులు పాడవుతున్నాయని, కస్టమర్లు రాక పోవడంతో ఆదాయం తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా వృద్ధులు, పిల్లలు, మహిళలు శ్వాస సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

చాలా కాలంగా రింగ్‌రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని, వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రింగ్‌రోడ్డు పనులను వేగవంతం చేసి తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

సమస్య పరిష్కారమయ్యే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని వ్యాపారస్తులు స్పష్టం చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని వ్యాపారస్తులతో చర్చలు జరిపినట్లు సమాచారం.

# జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు



**ధర్మసాగర్, జనవరి 24(తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మసాగర్‌లోని జెడ్పీహెచ్ఎస్ (బాయ్స్) పాఠశాలలో జనా విజ్ఞాన వేదిక, జెడ్పీహెచ్ఎస్ (బాయ్స్) సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు కే.బి. ధర్మ ప్రకాష్ అధ్యక్షత వహించారు.

సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న తెలుగు ఉపాధ్యాయురాలు రాజమ్మ బాలికల విద్య ప్రాధాన్యత, సమాన అవకాశాలు, సాధికారత అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు విద్యతో పాటు ఆత్మవిశ్వాసం, స్వావలంబనను పెంపొందించుకున్నప్పుడే సమాజం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు. బాలికల అభివృద్ధి కుటుంబం నుంచే ప్రారంభమవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు సురేష్, రామకృష్ణ, సుధీర్ రెడ్డి బాలికల హక్కులు, భద్రత, ఆరోగ్యం, సమాజంలో వారి పాత్రపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. బాలికలపై వివక్షను తొలగించి సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని అన్నారు.

ప్రధానోపాధ్యాయులు కే.బి. ధర్మ ప్రకాష్ మాట్లాడుతూ బాలికల విద్యే బలమైన సమాజానికి పునాదిగా నిలుస్తుందని, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో సమానత్వ భావనను పెంపొందించడంతో పాటు బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దుతాయని తెలిపారు.

# కమ్మరిపేటలో పశువులపై హైనా దాడి




అటవీశాఖ అధికారుల పరిశీలన

**వేలేరు, జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం కమ్మరిపేట గ్రామంలో యెలగుట్ట సమీపంలో నునావత్ చంద్రు వ్యవసాయ బావి వద్ద హైనా సంచరిస్తూ పశువులపై దాడి చేసి చంపిన ఘటనను అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, కమ్మరిపేట సర్పంచ్ జోడుముంతల కిరణ్ తెలియజేయడంతో అధికారులు స్పందించారు. సమాచారం అందుకున్న వెంటనే అటవీ శాఖ అధికారులు ఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. హైనా సంచార మార్గాలు, దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. గ్రామ పరిసరాల్లో పశుసంరక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైన తదుపరి చర్యలు చేపడతామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.



# మల్లాపూర్‌లో ఫ్యాక్టరీ ఫుట్‌వేర్ సేల్ ప్రారంభం

- ముఖ్య అతిథిగా నెమలి అనిల్



**మల్లాపూర్, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ లో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీ ఫుట్‌వేర్ సేల్ గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెమలి అనిల్ హాజరయ్యారు .ఈ సందర్భంగా షోరూమ్ యజమానులు అబ్దుల్ రెహ్మాన్‌కు నెమలి అనిల్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వ్యాపార రంగ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని అన్నారు. ఫ్యాక్టరీ ఫుట్‌వేర్ సేల్ ద్వారా ప్రజలకు నాణ్యమైన ఫుట్‌వేర్ ఉత్పత్తులు తక్కువ ధరలకు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అక్బర్, రాజేష్‌తో పాటు స్థానికులు, వ్యాపారవేత్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సేవలకే పరిమితమైన జర్నలిస్టులకు గౌరవం ఎప్పుడు?

**సమాజానికి సేవ చేసిన జర్నలిస్టులకు గుర్తింపు కరువు**
**-- బండి రాజు జర్నలిస్ట్**



**వనపర్తి,జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):** సమాజానికి దర్పణంగా నిలిచే జర్నలిస్టులు నేడు తీవ్రమైన నిర్లక్ష్యానికి గురవుతున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు, పాలకుల తప్పిదాలను ప్రశ్నించేందుకు తమ జీవితాలను పణంగా పెట్టి పనిచేస్తున్న జర్నలిస్టులకు తగిన గుర్తింపు, సత్కారం లభించడం లేదన్న భావన బలంగా వినిపిస్తోందని జర్నలిస్టు బండి రాజు అన్నారు.వర్షం, ఎండ, రాత్రి పగలు అన్న తేడా లేకుండా నిరంతరం ప్రజల కోసం పనిచేస్తూ వార్తలను అందిస్తున్న జర్నలిస్టులు, అధికారిక వేడుకలు మరియు సత్కారాల సందర్భాల్లో మాత్రం పక్కన పెట్టబడుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ, వారికి కనీస గౌరవం కూడా దక్కకపోవడం జర్నలిస్టు వర్గంలో తీవ్ర నిరాశను కలిగిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు..ఇలాంటి పరిస్థితుల్లో దేశ గౌరవం,ప్రజాస్వామ్య విలువలను గుర్తు చేసే గణతంత్ర దినోత్సవం సందర్భంగా అయినా జర్నలిస్టుల సేవలకు గుర్తింపు లభిస్తుందా? కనీసం ఈ గణతంత్ర దినోత్సవానికైనా సమాజానికి అంకితభావంతో సేవలందించిన జర్నలిస్టులకు గౌరవం దక్కుతుందా? లేక ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా వారు ప్రశ్నించేవారిగానే మిగిలిపోతారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు జర్నలిస్టుల వర్గంలో తీవ్రంగా చర్చకు వస్తున్నాయి.ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా భావించే జర్నలిస్టుల పాత్ర అమూల్యమైనదైనా, వారి సేవలను గుర్తించి సత్కరించే బాధ్యత ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, సమాజం మొత్తం మీద ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.




## విద్యార్థులు లక్ష్యం కోసం శ్రమించాలి

- తల్లిదండ్రుల ఆశయాలు సాధించాలి
- గొప్పవాడిగా ఎదుగుటకు నిరంతరం సాధన చేయాలి
- పట్టుదలతో సాధన చేస్తే విజయం సాధ్యం
- మీకోసం మీ లక్ష్యం కోసం నిరంతరం మార్పు చెందాలి

**పరకాల,జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):** పరకాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో అన్వేల్ డే కార్యక్రమం ప్రిన్సిపాల్ ఆర్ సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని నిరంతరం శ్రమించాలని, పట్టుదలతో సాధన చేస్తే విజయం సాధ్యమని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని సూచించారు.

ఈ కార్యక్రమానికి పేరెంట్స్ కమిటీ చైర్మన్, ఎస్ ఎస్ ఎఫ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, టీఎంజేఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ పెండ్యాల సుమన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, ఆ లక్ష్య సాధనకు నిరంతర సాధన అవసరమని ఆయన అన్నారు. ఉన్నతమైన ఆలోచనా విధానమే ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని, గొప్ప లక్ష్యాలను ఏర్పరుచుకొని గొప్పగా ఎదగాలని పిలుపునిచ్చారు. పలు మోటివేషనల్ కథనాల ద్వారా విద్యార్థుల్లో మార్పు తీసుకొచ్చే దిశగా, మంచి భవిష్యత్తుకు అవసరమైన ప్రణాళికను వివరించారు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న ఒగ్లపూర్ సర్పంచ్ కే శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న సౌకర్యాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డేవిడ్, ప్రియదర్శిని, ఏ సమ్మయ్య, రాజు, చారి శంకర్, బాలకృష్ణతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సి-295తో భారత రక్షణ రంగంలో కొత్త యుగం

(మొదటి పేజీ తరువాయి)



పర్వత ప్రాంతాలు, దీవులు, సముద్ర పరిధుల్లో వేగవంతమైన సైనిక మోహరింపుకు గాలి మార్గ రవాణా కీలకంగా మారుతున్న తరుణంలో, స్వదేశీంగా విమానాలను తయారు చేయడం, నిర్వహించడం భారత్ నిరోధక శక్తిని మరింత బలపరుస్తుంది. సరఫరా అంతరాయాలను ఆయుధంగా మార్చే పొరుగుదేశాల వ్యూహాలకు ఇది గట్టి సమాధానంగా నిలవనుంది. ముఖ్యంగా పాకిస్థాన్ వంటి దేశాలతో ఉన్న భౌగోళిక సవాళ్ల నేపథ్యంలో ఈ సామర్థ్యం వ్యూహాత్మక ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఎయిర్‌బస్ భాగస్వామ్యంతో తయారవుతున్న సి-295 విమానం, అసెంబ్లీ స్థాయి నుంచి సార్వభౌమ తయారీ సామర్థ్యానికి భారత్ అడుగుపెట్టిన సంకేతం. ఆధారపడే స్థితి నుంచి ప్రభావాన్ని సృష్టించే స్థాయికి చేరుతున్న భారత రక్షణ రంగానికి ఇది మైలురాయిగా నిలవనుంది.

# రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

- వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి



**వనపర్తి,జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి రైతు పక్షపాతిగానే పనిచేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి స్పష్టం చేశారు.శనివారం వనపర్తి మండలం రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతులకు రాయితీపై వ్యవసాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా రూ.77 లక్షల 13 వేల రూపాయల విలువైన రాయితీ వ్యవసాయ ఉపకరణాలను రైతులకు పంపిణీ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతు రుణమాఫీ, రాయితీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ, విత్తనాలు, ఎరువులు, డ్రిప్ పైపులు, స్పింకులర్లు, ట్రాక్టర్లు, కల్టివేటర్లు, రోటవేటర్లు, మందుల పిచికారి యంత్రాలు వంటి అనేక ఉపకరణాలను రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా ఒక్కో రైతుకు సుమారు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు లబ్ధి చేకూరుతుందన్నారు.గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రైతుల పేరుతో అనేక మోసాలు జరిగాయని, వాటికి నిలువెత్తు సాక్ష్యమే ఈ రోజు నిర్వహించిన రాయితీ వ్యవసాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమమని ఎమ్మెల్యే విమర్శించారు.కేవలం రైతుబంధు పేరుతో ప్రచార ఆర్భాటాలు తప్ప రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే వ్యవసాయ ఉపకరణాలపై రాయితీలను అప్పటి ప్రభుత్వం ఎత్తేసిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో అన్నదాతల ప్రయోజనార్థం నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానే నేటికీ సాగునీరు అందుతోందని, కాలువలకు బొక్కలు పెట్టి మేమే నీళ్లు తెచ్చామని చెప్పడం సిగ్గుచేటని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో నిర్మించిన ప్రాజెక్టులకు పూలు చల్లిన నాయకులు రైతుల గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు.పదేళ్ల పాలనలో లక్ష రూపాయల రుణమాఫీ చేయని వారు నేడు రుణమాఫీపై మాట్లాడడం విడ్డూరమని తెలిపారు.రైతుల సౌకర్యార్థం వేలాడుతున్న విద్యుత్ తీగలు, స్తంభాలు, నియంత్రికులను సరిచేయడానికి ఇటీవల రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయించామని పేర్కొన్నారు.జిల్లాల పునర్వ్యవస్థీకరణకు, రద్దుకు తేడా తెలియని కొందరు నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, పరిపాలన సౌలభ్యం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు చేపట్టిందన్నారు.వనపర్తి వేరుశనగ పంటకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని, ఇందుకు సంబంధించి పెద్దమందడి మండలం వీరాయపల్లి గ్రామంలో వేరుశనగ పరిశోధన కేంద్ర నిర్మాణ పనులను త్వరలోనే వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. వేరుశనగ పంటను కాపాడుకునేందుకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాష్ట్ర ముఖ్యమంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లి 50 శాతం రాయితీతో కంచ నిర్మాణం చేయించేందుకు బాధ్యత తీసుకుంటానన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, ఖిల్లా ఘణపురం సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, డైరెక్టర్ సాయి చరణ్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ శారద, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈస్ట్ గాంధీనగర్ నూతన అధ్యక్షులు జి. సత్యం సాగర్‌కు శాలువాతో సన్మానం

- నాగారం సగర సంగం సభ్యులు



**నాగారం, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ ఈస్ట్ గాంధీనగర్ నూతన అధ్యక్షులుగా జి. సత్యం సాగర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగారం సగర సంఘం ఆధ్వర్యంలో ఆయనకు శాలువాతో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘ నాయకులు మాట్లాడుతూ, జి. సత్యం సాగర్ సేవాభావం, సమాజ అభివృద్ధిపై ఉన్న చిత్తశుద్ధి దృష్ట్యా ఆయనను అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈస్ట్ గాంధీనగర్ ప్రాంతంలో సగర సంఘాన్ని మరింత బలోపేతం చేసి, సామాజిక కార్యక్రమాలు, సంక్షేమ సేవలను విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా సగర సంఘం జనరల్ సెక్రటరీ టి. నరసింహ సాగర్, నాగారం సగర సంఘం అధ్యక్షులు కేసాని రాజు సాగర్, జనరల్ సెక్రటరీ చెన్నయ్య సాగర్, కోశాధికారి వి. శేఖర్ సాగర్, ఉపాధ్యక్షులు ఎం. దేవేందర్ సాగర్, కేసాని రఘు సాగర్, టి రాము సాగర్ , జి . వెంకటసాగర్, టి శ్రీనివాస సాగర్, తదితర నాయకులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన అధ్యక్షులు జి. సత్యం సాగర్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన కాలనీ సగర సంగం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, యువత భాగస్వామ్యంతో ముందుకు సాగేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.



## వనపర్తి పట్టణంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తిజనవరి24 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి పట్టణంలోని మారెమ్మ కుంట కూడలి, గాంధీచౌక్ ఉర్దూ మీడియం పాఠశాల కూడలిలో రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రజలకు భద్రతతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. హైమాస్ట్ లైట్ల ఏర్పాటుతో రాత్రి వేళల్లో వెలుతురు సమస్య పూర్తిగా తొలగిపోతుందని పేర్కొన్నారు.

ఈ లైట్ల ఏర్పాటు వల్ల దీర్ఘకాలంగా ఉన్న సమస్య తీరిపోయిందని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా అధికారులు,ప్రజాప్రతినిధులను కోరినా సమస్య పరిష్కారం కాలేదని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు కావడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భాదిత కుటుంబాన్ని భువనగిరి ఎమ్మెల్యే వెంటనే ఆదుకోవాలి

- పిఓడబ్ల్యూ(విముక్తి) రాష్ట్ర కన్వీనర్ పెర్క సునీత డిమాండ్




**మేడ్చల్ మల్కాజ్గిరి, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** భువనగిరి నియోజకవర్గంలోని పెంచికల్ పహాడ్ గ్రామంలో 2026 జనవరి 13న నాలుగేళ్ల చిన్నారి లైంగిక దాడికి గురై తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, బాధిత కుటుంబాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వెంటనే అన్ని విధాలా ఆదుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ - విముక్తి) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ పెర్క సునీత డిమాండ్ చేశారు.జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవరి 24న జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలోని వికలాంగుల కాలనీలో ఐలపు పద్మ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నారిపై జరిగిన అమానవీయ దాడి నుంచి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడి ఇప్పటికే 12 రోజులు గడిచినా, స్థానిక ఎమ్మెల్యే ఇప్పటివరకు స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రజా ప్రతినిధిగా తన సామాజిక బాధ్యతను గుర్తించి బాధిత కుటుంబానికి తక్షణమే మానసిక ధైర్యం, ఆర్థిక సహాయం అందించాలని కోరారు.ఈ సందర్భంగా బహుజన సత్త రాష్ట్ర అధ్యక్షుడు బండకింది సింగరయ్య గౌడ్ మాట్లాడుతూ, పసిపిల్లపై జరిగిన ఘోర ఘటనపై ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం ఆందోళన కలిగిస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక (టియుకెవి) రాష్ట్ర కమిటీ సభ్యురాలు తుమ్మరాణి మాట్లాడుతూ, లైంగిక హింసను సమాజం తీవ్రమైన నేరంగా పరిగణించకపోవడం వల్లే బాలికలపై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టియుజేఏసి) రాష్ట్ర కమిటీ సభ్యురాలు సన్వాల సుచరిత మాట్లాడుతూ, చట్టాల అమలులో లోపాలు, అవగాహన కొరత వల్ల బాలికలు అసురక్షిత పరిస్థితులకు గురవుతున్నారని పేర్కొన్నారు.భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) కన్వీనర్ షేక్ షావలి మాట్లాడుతూ, మద్యం, మత్తు పదార్థాలు లైంగిక హింసకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడపిల్లలను గౌరవించే సామాజిక దృక్పథం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ చారి, బీసీ నాయకుడు డి. నర్సన్న, మైసయ్య, యమునా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# సినతల్లి నువ్వు 'విప్లవం' తేవాలి!



చినతల్లి
నువ్విలాగే నవ్వుతు ఎదగాలి
నీ భుజానికున్న రెక్కలు విప్పి
ఆకాశానికి ఎగరాలి!

నిను దాసిగా,బానిసగా చూపిన
ఆ మనువు రాతల్ని నువ్వు
తిరిగి రాయాలి
కాళ్ళకి కట్టిపెట్టిన సంకెళ్ళని తెంచి
అడుగడుగున నిన్ను అడ్డగించే వాడి
గుండెలపై
అదే కాలిని ఎక్కు పెట్టాలి.


ముఖాన ముసుగేసి కప్పమని
చెప్పిన ఈ సమాజం ముందు
నీ పైటనీ దిక్కార పతాకగా ఎగరేయాలి.
వంటింట్లో మంటకి
పడకగదిలో పక్కకి మాత్రమే నువ్వు
అన్నవాడి
గడియ తలుపుల్ని బద్దలు కొట్టి
వాన్ని బజారుకిడ్చి తన్నాలి.!

చిట్టితల్లి
నువ్వు పిడికిలి బిగించాలి
'ప్రేమ' నిషిద్ధమన్నా ఈ నేలపై
గులాబీలని నాటాలి
'ప్రేమ' నేరమన్నా ఈ ప్రభుత్వానికి
వ్యతిరేకంగా
నువ్వూ ప్రేమించి చూపాలి

అదరక,బెదరక నువు ముందుకి సాగాలి
నీ తోటి మనిషితో నిన్ను
సమానంగా చూడలేని

ఈ గుడ్డి పితృస్వామ్య వ్యవస్థ కళ్ళు పీకి
ఆపరేషన్ చేయాలి

ఎన్నో ఏళ్ల కింద నొక్కి పెట్టిన నీ
గొంతుకి నేడు
నువ్వు ప్రాణం పొయ్యాలి
రక్తపు ధారల గడ్డల్ని తన ఒడిన
దాచుకున్న
ఈ భూతల్లి యదని ముద్దాడి
విప్లవగీతాన్ని పాడాలి.
నాన్న నువ్వు ఈ చీకటిని తరిమెందుకు
'క్రాంతి'ని తేవాలి.!



✍ దియా_విఘ్నేష్

# బీఆర్ఎస్ నేతలపై కక్షపూరిత వైఖరి

◆ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు

గ్రేటర్ వరంగల్, జనవరి24(తెలంగాణ ముచ్చట్లు):

గ్రేటర్ వరంగల్ 29వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్ నిర్వహిస్తున్న షాప్‌ను ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేయడం అన్యాయమని, అక్రమమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. శనివారం ఉదయం సదాంత్ షాప్‌ను కూల్చివేసిన ఘటనపై స్పందించిన ఆయన, మాజీ కార్పొరేటర్ *దాస్యం విజయ్ భాస్కర్*తో కలిసి కూల్చివేతకు గురైన షాప్‌ను, బాధిత కుటుంబ సభ్యులను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి సానుభూతి, సంఘీభావం ప్రకటించారు. ఆర్ ఎస్ ప్రవీణ్



కుమార్ మాట్లాడుతూ... అన్ని అనుమతులు, ట్రేడ్ లైసెన్స్, విద్యుత్ బిల్లులు, ప్రైవేట్ స్థల యజమానితో ఒప్పందం ఉన్నప్పటికీ ప్రతిపక్ష పార్టీకి చెందిన నేత షాప్ కావడమే కారణంగా కూల్చివేతలకు పాల్పడ్డారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్‌కు ఈ కూల్చివేతల విషయం తెలియదా అని ప్రశ్నించారు.
ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సదాంత్ స్వయం ఉపాధి కోసం షాప్ నిర్వహిస్తుంటే ప్రభుత్వం ఎందుకు ఈ విధంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గానికి ఈ ప్రభుత్వం రుణాలు ఇవ్వలేదని, సబ్ ప్లాన్ నిధులు కనిపించడం లేదని విమర్శించారు. గురుకులాల్లో పేద పిల్లలు మరణిస్తున్నారని, ఇప్పటికే చిరు వ్యాపారుల జీవనాధారాలను దెబ్బతీసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ప్రతిపక్ష పార్టీ నాయకులపై పగతో జీవనోపాధిని నాశనం చేస్తోందని అన్నారు. భద్రకాళి దేవస్థానం ఎదుట ప్రైవేట్ భూమిలో



నిర్వహిస్తున్న సదాంత్ షాప్‌ను ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఉదయం ఐదు గంటలకే కూల్చివేశారని తెలిపారు. ఈ కూల్చివేతలో లక్షల రూపాయల విలువైన సామాగ్రి ధ్వంసమైందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై పోరాడుతున్నాడన్న కోపంతోనే కక్షపూరితంగా ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. వెంటనే షాప్ యజమాని, బీఆర్ఎస్ పార్టీ 29వ డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్‌కు తగిన నష్టపరిహారం చెల్లించాలని, జీవనోపాధికి ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత సంఘాలు, గులాబీ శ్రేణులతో కలిసి ఉద్యమానికి దిగుతామని హెచ్చరిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.





# ఏఐఆర్ పెన్షనర్స్ అసోసియేషన్ జోనల్ కార్యాలయం ప్రారంభం

మల్కాజ్గిరి, జనవరి 24 (తెలంగాణ ముచ్చట్లు)

సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో ఏఐఆర్ పెన్షనర్స్ అసోసియేషన్ జోనల్ కార్యాలయాన్ని డాక్టర్ శంకర్ రావు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, రైల్వే పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా మాజీ మజ్దూర్ యూనియన్ వైస్ చైర్మన్, రైల్ నిలయం బ్రాంచ్ నాయకుడు, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు నూర్‌తో పాటు ఇతర నాయకులు ఏఐఆర్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ శంకర్ రావు, ప్రధాన కార్యదర్శి యుగండర్‌లను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వి. అరుణ్ కుమార్, భాగ్యవతి, పి.బి.ఎన్. ప్రసాద్, మూర్తి, రఘు తదితరులు పాల్గొన్నారు. రైల్వే పెన్షనర్ల సంక్షేమానికి ఈ జోనల్ కార్యాలయం ద్వారా మరింత బలమైన సేవలు అందించాలని వక్తలు ఆకాంక్షించారు.



# వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం ద్వారా కూరగాయల రైతులకు ఉపకరణాల పంపిణీ

పెద్దమందడి,జనవరి24 (తెలంగాణ ముచ్చట్లు):

వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం ద్వారా చిన్నమందడి గ్రామంలో కూరగాయలు సాగు చేస్తున్న రైతులకు ప్లాస్టిక్ పెట్టెలు, వర్మీ కంపోస్టు సంచులు, తేనెటీగల పెంపకానికి అవసరమైన పెట్టెలను ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నేడు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా క్లస్టర్ ఉద్యాన అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ, చిన్నమందడి క్లస్టర్ పరిధిలోని చిన్నమందడి, పామిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 32 మంది కూరగాయలు సాగు చేసే రైతులను గుర్తించి, ఈ పథకం కింద వారికి కూరగాయల తరలింపుకు అవసరమైన పెట్టెలు, తేనెటీగల పెంపకానికి పెట్టెలు, రైతులు స్వయంగా వర్మీ కంపోస్టు తయారు చేసుకునేందుకు వర్మీ సంచులను అందజేశామని తెలిపారు.తేనెటీగల పెంపకం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని, దీనిపై ఆసక్తి గల రైతులు ముందుకు వస్తే కూరగాయల సాగు మరియు తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో కూరగాయల సాగు మరింత పెరగాల్సిన అవసరం ఉందని, ప్రస్తుతం కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి శ్రీకాంత్, చిన్నమందడి సర్పంచ్, మాజీ సర్పంచ్, ఉద్యాన విస్తరణ అధికారి రేవతి, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఆదిత్యుడు - కాలస్వరూపుడు - రథసప్తమి



"తం సూర్యం ప్రణమామ్యహమ్"

అంటూ రెండు చేతులెత్తి నమస్కరిస్తే చాలు ప్రీతిగా అందరికీ ఆరోగ్యాన్ని, ఆయుష్షను ప్రసాదిస్తున్న ప్రత్యక్ష భగవానుడు శ్రీ సూర్యదేవుడు. లోక బాంధవుడు, ఆదిత్యుడు, భాస్కరుడు, ఇలా ఎన్నో పేర్లతో భాసిల్లుతున్న స్వామి శ్రీ సూర్యభగవానుడు. ముల్లోకాల్లో, అనంతజ్యోతి చక్రంగా ప్రకాశిస్తూ సమస్త గ్రహాల్ని తన చుట్టూ పరిభ్రమింప చేస్తాడు. ఆదిత్యుడు రాత్రుళ్లు, పగళ్లు, పక్షాలు, నెలలు, ఋతువులు, అయనాలను, సంవత్సరాలను సృజిస్తూ, మహత్తరమైన కాలస్వరూపాన్ని ప్రతిక్షణం దర్శింపజేస్తూన్న దైవం సూర్యభగవానుడు
సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్నట్లు లోకాలకు అన్నింటికి సూర్యుడు క్షేత్రం వంటివాడు. ప్రపంచమంతా సహస్రకరణుడైన భాస్కరునివలె ప్రకాశిస్తున్నది. చూడగల్గిన కన్నులున్నా చూపించగల వెలుగు ఉంటేనే కదా సార్ధకం! కనుకనే ప్రపంచానికంతా వెలుగును ప్రసాదించి అనంతమైన ప్రకృతిని, అద్భుతమైన భగవత్సృష్టిని దర్శింపజేస్తూన్నాడు సూర్యుడు. సూర్యుడు జగచ్చక్షువుగా, విరాట్పురుషుడైన భగవంతుని నేత్రంగా వినుతింపపడ్డారు. అపూర్వమైన వెలుగును, కాంతిని గూర్చి చెప్పదలచుకున్నప్పుడు సూర్యదేవుడు మనకు పరమోన్నతమైన ప్రమాణం. అందువల్లనే అనంతమైన వాఙ్మయ ప్రపంచంలో కోటి ప్రభాభాసితుడని, సహస్రకిరణ తేజోవిరాజితుడని శ్రీమన్నారాయణుడు పేర్కొనబడ్డాడు. ఇలా ఏకైక ఉపమానంగా స్వీకరింపబడుతున్న ఆదిత్యుని కూడా 'ఆదిత్యా నామహం విష్ణు: జ్యోతిషా రవిరంశుమాన్' తనే నంటూ శ్రీకృష్ణ భగవానుడు స్పష్టపరిచాడు. అనంత తేజోవిరాజితుడుగా, సకల దేవతాస్వరూపుడుగా ప్రత్యక్షంగా కనిపించే సూర్యభగవానుణ్ణి ఎందరెందరో ఎన్నో విధాల ప్రార్ధించి ఇష్టార్ధ సిద్ధిని పొందారు.
సూర్యోపాసన ద్వార సత్రాజిత్తు బారువుల కొద్దీ సువర్ణాన్ని కురిపించే 'శ్యమంతక మణి'ని పొందగా, కుంతీదేవి సహజకుండల విరాజితుడైన కర్ణుని పుత్రునిగా పొందింది. ఆదిత్యుడు పాండవులకు అరణ్యవాస సమయంలో ఆహా సమస్యను తీర్చడానికి అక్షయపాత్రను ధర్మరాజుకు అనుగ్రహించారు. మయూరుడు సూర్యుని ద్వారా భయంకరమైన శారీరక రుగ్మతల్ని పోగొట్టుకొని, పరిపూర్ణ ఆరోగ్యవంతుడై మయూర శతకం రచించాడు రామభక్తాగ్రేసరుడు, చిరంజీవి, భవిష్యబ్రహ్మ అయిన ఆంజనేయస్వామి సూర్యశిష్యుడై విద్యను అభ్యసించాడు.
యజ్ఞవల్య మహాముని సూర్యునివల్ల శుక్లయజుర్వేదాన్ని సృష్టిం ప్రజేశాడు. శ్రీరాముడు సూర్యుణ్ణి ఆరాధించి యుద్ధంలో విజయలక్ష్మిని చేపట్టాడు. ఐశ్వర్యాన్ని, ఆరోగ్యాన్నీ, సంతానాన్నీ విద్యలనూ, విజయాలను ఇలా అన్నీ ప్రసాదించి, ఇక తాను లేనిదంటూ ఏదీ లేదని నిరూపించుకున్న సర్వసిద్ధి ప్రదాత ప్రభాకరుడు, ప్రతి నిత్యం బ్రాహ్మీముహూర్తంలో ఉపాసింపబడు తాడు. తన ఉదయం ద్వారా సమస్త చరాచర వస్తువులనంతటిని మేల్కొలుపుతూ నిత్యజాగృతంచేస్తాడు. తన చలనం ద్వారా ప్రకృతిలో సమతుల్యతను పరిరక్షిస్తూ, లోకానికంతటికి కన్నుగా, కర్మసాక్షిగా తన విధిని తాను నిర్వహిస్తాడు. 'కాలాన్ని అతిక్రమించడం ఎవరికి సాధ్యం కాదు' అంటూ కాలగమనాన్ని కాలతత్వాన్ని అనుక్షణం ప్రత్యక్షంగా దర్శింపజేస్తు అనుగ్రహిస్తున్నారు. అందరినీ అనుగ్రహిస్తున్న లోకబాంధవుడు శ్రీసూర్యనారాయణస్వామి. సూర్యజయంతిగా పరిగణింపబడు తున్న 'రథసప్తమి' నుండి దివాకరుడు ఉత్తరదిశగా తన రథాన్ని మరలిస్తూ ఉత్తరోత్తర ఉత్తమమైన కోరికలను ప్రసాదించాలి. త్రిమూర్తి స్వరూపుడైన సూర్యభగవానుణ్ణి ఆరాధన ఉత్కృష్టమైనది.

సూర్యుడు ప్రత్యక్షనారాయణుడు. సమగ్రహమండలానికి అధిపతి. ఆయన ఆవిర్భవించినరోజు రథసప్తమిగా ప్రసిద్ధి. అందుకే "రథసప్తమిని "సూర్యజయంతి" అనికూడా పిలవడం కద్దు. ఆయనకు ఇంకొక పేరుకూడా ఉంది. వివస్వంతుడని, ఆ వివస్వంతుని కొడుకు వైవస్వతుడు. ఈ వైవస్వతుడు ఏడవమనువు. అందుకే ఈ రోజును వైవస్వతమన్వాది దినంగా పిలుస్తారు. ఈ రోజు పితృదేవత లకు చాల ప్రీతికరమయినది. పితృ కార్యాలు నెరవేర్చి, బ్రాహ్మణులకు దానాలు, అన్నసంతర్పణలు, మున్నగు కార్యాలతో గృహస్థులు తమ తమ పితృ దేవతలకు ప్రీతి కలిగించే కార్యక్రమాలలో నిమగ్నమవుతూ ఉండడం మనం రథసప్తమినాడు విరివిగా చూస్తుంటాము.
భాగవతంలో "ఈ వైవస్వత మన్వాదియే ఉగాదిగా పేర్కొనబడింది. కానీ కాలక్రమంలో ఆ ఆచారం మార్చి పోయినా, మనదేశంలో రాజపుత్రస్థానంలోని కొన్ని ప్రాంతాలలో మాత్రం ఈ పండుగ 'రథసప్తమి'కి ముందుగా జరుపుకుంటున్నారు.



''రథసప్తమి' అంటే 'మాఘ శుక్ల సప్తమి' ఈ పర్వదినాన అందరూ ఉదయాన్నే జిల్లేదు ఆకులలో రేగిపళ్ళుంచి, నెత్తి మీద, భుజాలపైనా, తొడల పైనా ఉంచుకొని, స్నానాలు చేస్తారు. వేడి వేడి నీరు జిల్లేళ్ళపై నుంచి శరీరంపై దొర్లడం వల్ల, జిల్లేళ్ళపై నుండే సన్ననినూగు మన చర్మాలకు మంచిచేస్తుందనేది ఆయుర్వేద ప్రకృతి వైద్యప్రమాణం. తర్వాత ఇంటిలో ఆరుబయట చిక్కుడు ఆకులతోను, కాయలతోను, అమర్చిన ప్రదేశంలో పొంగలి వండి. ఆ పొంగలిని చిక్కుడు. ఆకుల్లో ఉంచి, సూర్యదేవునికి నైవేద్యంగా అర్పించి. కుటుంబీకులంతా ప్రసాదాన్ని ఆనందంగా ఆస్వాదిస్తారు. ఈ చిక్కుళ్ళ పరుపును "సూర్యరథం"గా చెప్పుకుంటాడు. జిల్లేడు ఆకులను తలపై ధరించి, స్నాన పూర్వకంగా వాటిని ఈనాడు వదలడం అంటే సాంకేతికంగా సూర్యుడు ఉత్తర గమను చయినందువల్ల సూర్యరశ్మిలోని నీలకాంతి కిరణాల ప్రభావం జీవులపైన కొంత తగ్గుతుంది అని తెలియచెప్పే సాంకేతిక ప్రక్రియ బహుశ! ఈ విధమైన సంప్రదాయంగా మారి ఉంటుందనే అభిప్రాయం "మనకు కలగడంలో విశేషమే ముంటుంది? ఆయుర్వేదంలో జిల్లేడు. పాలతో అనేకమయిన వైద్యలున్నాయన్న విషయం మరువరానిదేమరి! జిల్లేళ పాలతో ఉప్పుకలిపి వాడితే పంటినొప్పి నివారణ అవుతుందని. చిగురాకులు చంపినప్పుడు స్రవించే ఆ ద్రావణాన్ని చెవి పోటుకు మందుగా వాడతారనీ, ఆకును నిప్పులపై వెచ్చచేసి, ఆముదం రాసి, బొడ్డు పైన వేస్తే కడుపు ఉబ్బరం, నొప్పి తగ్గుతాయని చెబుతుండడం మనందరికీ తెలిసిన విషయమే! ముఖ్యంగా తెల్లజిల్లేడు లక్ష్మీకరమయిందిగా చెబుతారు. ఈ మొక్క వేరుతో చేసిన వినాయకప్రతిమలకు పూజల చేయడంవల్ల విశేషఫలితాలు పొంద వచ్చు. వినాయకక్షేత్రాలలో ఈ "శ్వేతార్క" (తెల్లజిల్లేడు) కొయ్యతో చేసిన గణపతి విగ్రహాలు మనకు లభ్య మవుతూంటాయి. వీటిల్ని గృహంలో పూజలు చేసి, గణనాథునికి ప్రీతిపాత్రు లవుతుంటారు భక్తజనులు, తెల్లజిల్లేడుగూర్చి లోతుగా విచారిస్తే, అనేకమయిన సంభ్రమాశ్చర్యాలు గొలిపేవిషయాలు మనకు తెలుస్తాయి. ఈ తెల్లజిల్లేళ్ళను 'శ్వేతారం సూర్యాసాయ, రవి పేర్లతో పిలవడంపల్ల, దీనితో సూర్యునికి అనుసంధింపబడే అనేకమయిన ప్రయోగాలు, ఉపయోగాలు, ఉండడంపుల్లనూ, రథసప్తమి పర్వ దినం సూర్యునిపండుగ అయినందువల్ల, వీటిని ఈనాడు వాడడం సంప్రదాయం. ఈ సంప్రదాయంలో శాస్త్రీయత నిండి. ఉందనడంలో ఆశ్చర్యంలేదు. "రథసప్తమి" సూర్యుని జన్మదినం. ఈ రోజు సూర్య గ్రహణ పుణ్యకాలంతో సమమయిం దని శాస్త్రాలలో విశేషంగా చెప్పబడింది.శాస్త్రసమ్మతంగా సూర్యదేవుట్టి పూజాది నైవేద్యాలతో పారాయణలతో పూజించి పునీతులవడం ప్రతి ఒక్కరికీ అత్యంత ఆవశ్యకం.
ఆదివారంతో కలసి వస్తే (రథసప్తమినాడు ఆదివార మయితే) ఆదినం శతాధికంగా అనుకూలం. ఎందుకంటే మాఘ మాసంలోని ప్రతిఆదివారమూ రథసప్తమితో సమానమైన పవిత్రదినమే! అటువంటి ఈ పర్వదినం ఆదివారసహిత మయితే మరింతగా విశేషాన్ని సంతరించుకుంటుంది. ఇంకా షష్టిసప్తమి (తిథిద్వయం) అయితే 'పద్మకయోగం' అని స్కాందపురాణంలో ఉంది. ఇన్ని విశేషా కనుకనే వేయి సూర్యగ్రహణ కాల "ఫలం "రథసప్తమి" నాడు మనం పొందవచ్చు నన్నారు పెద్దలు.
రథసప్తమికీ, రేగుపళ్ళకూ అవినాభావసంబంధముంది. మూలాల్లోకి పోతే భవిష్యోత్తరపురాణంలో రథసప్తమి నాడు ఏడు జిల్లేడు ఆకులుగానీ, ఏడురేగు ఆకులుగానీ, విడివిడిగాగానీ, సంయుక్తంగా కానీ, తలపై పెట్టుకొని స్నానం చేయాలని ఉంది. రేగు ఆకులసమాచారం ఎలా ఉన్నా జిల్లేడు ఆకులు ధరించి, స్నానంచేయడం మనతెలుగువారి సంప్రదాయం. ఈ సంప్రదాయం ఈనాటికీ కూడా పల్లెల్లోనూ, పట్టణాలలోను మనకు కనబడుతూ ఉంటుంది. భోగినాడు ఏ విధంగా రేగుపళ్ళు పిల్లలకు "భోగిపీడ" వదలా లని పోస్తారో, అదే ప్రయోగం ఈ నాడు (అంటే రథసప్తమి) రేగిపండ్లు తలపై ఉంచుకొనిస్నానం చేయడంలోని ఆంతర్యం! ఇలా రేగులతో స్నానం చేయడం వల్ల పీడ వదులుతుంది అనే నమ్మకం.

చిక్కుడు రథసప్తమి

కార్తికంలో కసురంత మొక్కగా ఉండేచిక్కుడుపాదు మాఘమాసంలో తనమహిమే చూపుతుందంటారు చిక్కుడు కాయలతో, ఆకులతో వెదురుదబ్బలతో సూర్యరథం కూర్చుకొని, నైవేద్యాన్ని సమర్పించే పాత్రను ఆ రథంలో పెట్టి, సూర్యభగవానునికి పొంగలి సమర్పిస్తారు. నైవేద్యం అయిన తర్వాత ప్రసాదంగా వేడివేడి పొంగలిని చిక్కుడు ఆకులలో ఉంచి తినడంవల్ల, వేడికి ఆకులోని పసరు పొంగలిని చేరి. రసాయనికంగా మార్పు చేర్పులు జరగడంవల్ల, ఆ ప్రసాదం ఆరోగ్యప్రదంగానూ, ఆరోగ్య వర్ధకంగానూ మారుతుంది. ఈ సంప్రదాయం ప్రకృతిని దైవ సమంగా ఆరాధించే ప్రక్రియలో ఒక భాగం.
సూర్యదేవుడు పుట్టిన మాసం మాఘం. 'మాంఅఘం మాఘంపాపం లేనిది అనీ అర్థం! అందుకే మాఘమాసంలో ప్రతిదినం సూర్యపూజలు చేయాలి.

రథసప్తమి నాడు పొంగలి నైవేద్యం చేయడంలో ఒక విషయం అంతర్గతంగా ఉంది. కొత్తపంట చేతి కందివచ్చిన సమయం. కొత్తగా వచ్చినధాన్యం ముద్దగడుతుంది. నాగరికత పేరుతో ముద్ద అయిన అన్నం మనలో కొందరికి నచ్చదు విధిలేని పరిస్థితి అందుకని సంప్రదాయంగా కొత్త ధాన్యాన్ని వాడుకలోనికి తెచ్చేప్రక్రియ ఇది. ఆదిత్యుడు ఆరోగ్యప్రదాత. అందుకే ఆయన జన్మ అంటే రథసప్తమినాడు ఆరోగ్యసప్తమీవ్రతం ఆరంభి స్తారు. ఈ వ్రతం చేసి, దానధర్మాలు చేసి, సూర్యుణ్ణి కృష్ణుణ్ణి చేస్తే స్వయంగా ఆయింట తానే పుడతా నని సూర్యుడు చెప్పాడు.
కలా ఎన్నో పుణ్యవ్రతాలు భానుని జన్మదినమయిన రథసప్తమినాడు ఆరంభించి, సంప్రదాయసిద్ధంగా పూర్తిచేసి, తర్చలాన్ని అందుకుంటారు. వేద, సంస్కృత అధ్యాయులు ఈ దినం సెలవు తీసుకొంటారు. శాస్త్రంలో ఈ రోజును 'అనధ్య యన దినం' అంటారు.
సూర్యునిరథానికి ఏడుగుర్రా లుంటాయి. సూర్యకిరణాలలో | ఏడురంగులు కలిసిన ఇంద్రధనుస్సు ఉంటుంది. ఈ పవిత్రమయిన దీనం సప్తమినాడు రావడం ఎదురకాలధాన్యాలు ఈ పండుగలో వాడతారు. ఇలా ఏడు సంఖ్యతో అనుబంధం. ఉన్నసూర్యనారాయణుణ్ణి 'సప్తలోక ప్రదీపకుడు' అని శాస్త్రం. చెప్పింది.
ఉత్సాహవంతులు కొందరు 'రథసప్తమి' పండుగను ఒరిస్సారాష్ట్రంలో సముద్రపుబొడ్డున ఉన్న కోణార్క్ క్షేత్రంలో జరుపుకుంటే శతాధికఫలం ఉంటుందన్న ఆలోచనలతో రథసప్తమి నాడు కోణార్క పోయి, ఆలయ ప్రాంతంలో వేడుకలు చేసుకుంటారు.
సూర్యభగవానుడు ప్రత్యక్షదైవం. వేదాలలో సూర్యారాధనలు అనేకంగా ఉన్నాయి. భారత, భాగవత, రామాయణాలలో సూర్యో పాసన అవతార మూర్తులే స్వయంగా చేసినట్టు కథలున్నాయి.



ఆధ్యాత్మిక సాహిత్య వ్యాసభూషణ్, ఆధ్యాత్మక సాహిత్య సామ్రాట్ కావ్యసుధ, హైదరాబాద్, సెల్ 92473 13488

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in